
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY ఖమ్మం KHAMMAM

శుక్రవారం, 7 ఫిబ్రవరి 2025



రామయ్యకు రూ.1.13 కోట్ల హుండీ ఆదాయం

భద్రాచలం, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): భద్రాచల శ్రీసీతారామచంద్రస్వామి వారి దేవస్థానానికి హుండీల ద్వారా రూ.1,13,23,178 ఆదాయం లభించింది. రూ.1,13,23,178 నగదు, 0.109 గ్రాముల బంగారం, 0.895 గ్రాముల వెండి లభించాయి. 298 యుఎస్ డాలర్లు 155 సింగపూర్ డాలర్లు, 85 ఆస్ట్రేలియా డాలర్లు, 45 యూరోలు, 20 కెనడ డాలర్లు లభించాయి. హుండీలను చివరగా డిసెంబరు 30న లెక్కింపు నిర్వహించారు. అనంతరం మళ్లీ 38 రోజుల అనంతరం లెక్కింపు జరిగింది. కార్యక్రమంలో ఆలయ ఈవో, పర్యవేక్షకులు, సిబ్బంది పాల్గొన్నారు.

టైగర్ 'భద్ర'

- భద్రాద్రి కొత్తగూడెం, ములుగు జిల్లాల్లో సంచరిస్తున్న పెద్దపులి
- మగ పులిగా గుర్తించి నామకరణం చేసిన అటవీశాఖ అధికారి క్రిష్ణ గౌడ్




అటవీశాఖ అధికారులు సీసీ కెమెరాలో గుర్తించిన పెద్దపులి

కరకగూడెం, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): భద్రాద్రి కొత్తగూడెం, ములుగు జిల్లా అటవీ ప్రాంతంలో సుమారు మూడు నెలలుగా పెద్దపులి సంచరిస్తోంది. భద్రాద్రి కొత్తగూడెం, ములుగు జిల్లా సరిహద్దుల్లో ఎక్కువగా అటవీ ప్రాంతం ఉండటంతో పెద్దపులి ఇక్కడ ఆవాసం ఏర్పర్చుకున్నట్టుగా అటవీ శాఖ అధికారులు వెల్లడించారు. ఇక్కడ సంచరిస్తున్న పెద్దపులి ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర రత్నగిరి టైగర్‌జోన్ నుంచి నవంబరు నెలలో ములుగు జిల్లా ఏటూరునాగారం, మంగపేట, మల్లూరు అటవీ ప్రాంతం నుంచి కరకగూడెం, తాడ్వాయి అటవీ ప్రాంతంలో సంచరిస్తున్నట్లు అటవీ శాఖ అధికారులు తెలిపారు. గురువారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సరిహద్దులోని ములుగు జిల్లా సౌలేడు పంబాపుర్ అటవీ ప్రాంతంలో పెద్దపులి సంచరించినట్లు అటవీ శాఖ (మిగతా 6వ పేజీలో)

ఖమ్మం మార్కెట్‌కు పోటెత్తిన ఎర్ర బంగారం

తొలిసారి 80 వేల మిర్చి బస్తాల రాక 6





నియోజకవర్గాల్లో మీరే కీలకం

స్థానిక సంస్థల ఎన్నికలు జరగబోతున్న నేపథ్యంలో సీఎల్పీ సమావేశం నిర్వహించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాష్ట్రస్థాయిలో మంత్రులు, ఎమ్మెల్యేలకు దశ, దిశా నిర్దేశం చేశారు. జిల్లాకు చెందిన ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్యేలు మాలోతు రాందాస్‌నాయక్, మట్టా రాగమయి, జారే ఆదినారాయణ, కోరం కనకయ్య, పాయం వెంకటేశ్వర్లు హాజరయ్యారు. భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకటరావు పార్టీ ఫిరాయింపు కోర్టు కేసు నడుస్తున్నందున ఆయన హాజరుకాలేదు. కొత్తగూడెం ఎమ్మెల్యే సీపీఐ నేత కావడం ఆయన కూడా సమావేశానికి హాజరుకాలేదు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమపథకాల గురించి వివరించడంతో పాటు రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపైనా ఏ నియోజకవర్గాల్లో ఎంత నిధులు ఖర్చు చేసిందన్న విషయాలపై కూడా స్పష్టత ఇచ్చినట్టు తెలిసింది. అభివృద్ధి సంక్షేమంతో పాటు త్వరలో జరగబోతున్న పంచాయతీ, మండల, జిల్లాపరిషత్ స్థానిక సంస్థల ఎన్నికలు పరీక్ష కాబోతున్నందున ప్రతీఒక్కరు ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలని, నియోజకవర్గ స్థాయిలో ఎమ్మెల్యేలదే కీలకపాత్ర అని సూచించినట్టు సమాచారం.

- ప్రభుత్వ కార్యక్రమాలను ప్రచారం చేయాలి
- కులగణన, రిజర్వేషన్లను ప్రజల్లోకి తీసుకెళ్లాలి
- విపక్షాల విమర్శలను తిప్పికొట్టండి
- సమస్యలుంటే నేరుగా నన్ను కలవండి
- స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని చోట్లా కాంగ్రెస్ జెండా ఎగరాలి
- ఎమ్మెల్యేలకు సీఎం రేవంత్ దశ, దిశా నిర్దేశం

ఖమ్మం, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): కులగణన, ఆయా వర్గాలకు కేటాయిస్తున్న రిజర్వేషన్లపై కూడా విస్తృతంగాప్రచారం చేయాలని కొంతమంది కులసంఘాలు, విపక్షాలు చేపట్టే ఆందోళనలు విమర్శలను తిప్పికొట్టాలని రేవంత్ రెడ్డి నేతలకు సూచించారు. అయితే ఎమ్మెల్యేలను వ్యక్తిగతంగా సీఎం కలవాలని అనుకున్నా కలవలేదని తెలిసింది. వ్యక్తిగతంగా ఎలాంటి సమస్యలున్నా, మంత్రులతో ఏమైనా ఇబ్బందులున్నా నేరుగా తనను కలిసి చెప్పుకోవచ్చని, ఈ సందర్భంగా ఎమ్మెల్యేలకు భరోసా ఇచ్చినట్టు పార్టీ వర్గాల కథనం..

సీఎంతో ఎంపీ, ఎమ్మెల్యేల భేటీ

ఇల్లెందుటౌన్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): ఎస్టీ నియోజకవర్గాల ఎమ్మెల్యేలు, ఎంపీతో గురువారం సీఎం రేవంత్‌రెడ్డితో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా సీఎంకు వారు సీఎంకు పుష్ప గుచ్ఛం అందజేసి సత్కరించారు. ఈ సమావేశంలో ఆదివాసీ గిరిజనుల సంక్షేమంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టాలని సీఎంను కోరారు. ఆదివాసీ ప్రాంతాల్లో రహదారులు, ఇందిరమ్మ ఇళ్ల, బోరు బావులు, విద్యుత్ పోడు భూముల సమస్యలు పరిష్కరించాలని సీఎం దృష్టికి తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాం నాయక్, ఎమ్మెల్యేలు కోరం కనకయ్య, జారే ఆదినారాయణ, తెల్లం వెంకట్రావు, పాయం వెంకటేశ్వర్లు, రాందాస్‌నాయక్ పలువురు ఆదివాసీ గిరిజన నియోజకవర్గానికి చెందిన ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



సీఎంకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎమ్మెల్యేలు, ఎంపీ

గద్దర్ కుమార్తెకు ఆత్మీయ పురస్కారం

- ముగిసిన అంతర్రాష్ట్ర స్థాయి నాటకోత్సవాలు



వెన్నెలను సన్మానిస్తున్న దృశ్యం

భద్రాచలం/ ఖమ్మం సాంస్కృతికం, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ సాంస్కృతిక సారథి చైర్‌పర్సన్, ప్రజా యుద్ధనౌక గద్దర్ కుమార్తె డా. జీవీ వెన్నెలకు భద్రాద్రి కళాభారతి ఆధ్వర్యంలో ఆత్మీయ పురస్కారం అందజేశారు. భద్రాచలంలో మూడు రోజుల పాటు భద్రాద్రి కళాభారతి ఆధ్వర్యంలో నిర్వహించిన 23వ అంతరాష్ట్ర స్థాయి నాటకోత్సవ సాంస్కృతిక సంబురాలు గురువారం ముగిశాయి. ఈసందర్భంగా భద్రాచలం ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడామైదానంలో చివరి రోజున నిర్వహించిన కార్యక్రమంలో డా. వెన్నెలను సత్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నాటక, కళారంగాలు సమాజానికి (మిగతా 6వ పేజీలో)

క్రీడలతో మానసిక దృఢత్వం

- ఎమ్మెల్యే కూనంనేని, కలెక్టర్ జితేష్ వి. పాటిల్
- కొత్తగూడెంలో రాష్ట్ర స్థాయి బ్యాడ్మింటన్ పోటీల ప్రారంభం

7

సింగరేణి రక్షణకు ఉద్యమిస్తాం

- ప్రైవేటు వ్యవస్థలతో బొగ్గు ఉత్పత్తి యత్నాలు విరమించుకోవాలి
- బొగ్గు బావుల మీద శ్రద్ధ చూపకుండా ప్రైవేటు వ్యాపారాలపై సంస్థ దృష్టి
- అవినీతి, రాజకీయ జోక్యం తారస్థాయికి పెరిగింది
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు



మీడియాతో మాట్లాడుతున్న కూనంనేని

కొత్తగూడెం, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): సింగరేణి సంస్థ పరిరక్షణకు, కార్మికుల హక్కుల రక్షణకోసం ఉద్యమం చేస్తామని, సింగరేణి సంస్థలో ప్రైవేటు వ్యవస్థలతో బొగ్గు ఉత్పత్తి యత్నాలు విరమించుకోవాలని సీపీఐ రాష్ట్రకార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. కొత్తగూడెంలోని బాబు క్యాంపులోని రజబలి భవన్‌లో గురువారం సింగరేణిలో గుర్తింపు కార్మిక సంఘమైన ఏఐటీయూసీ ప్రతినిధులతో కలసి ఎమ్మెల్యే కూనంనేని విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సింగరేణి సంస్థ బొగ్గు బావుల మీద శ్రద్ధ చూపకుండా ప్రైవేటు వ్యాపారాలపై సంస్థ దృష్టి నిలిపిందని, సింగరేణిలో చట్ట వ్యతిరేక కార్యకలాపాలు ఎక్కువయ్యాయని, సంస్థలో అవినీతి, రాజకీయ జోక్యం తారస్థాయికి పెరిగిందని విమర్శించారు. సింగరేణి రిటైర్డ్ కార్మికులకు సొంత ఇంటి పథకం అమలు చేయాలని ఆయన డిమాండ్ చేసారు. కొత్తగూడెం, ఇల్లెందు కొత్త గనుల్లో బొగ్గు తీయడాన్ని ప్రైవేటు వాళ్లకు అప్పచేప్పే చర్యలు చట్ట విరుద్ధమని అన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో సింగరేణిలో ప్రైవేటీకరణకు ఎక్కువగా మొగ్గుచూపిందని, కాంగ్రెస్ ప్రభుత్వమైన జోక్యం చేసుకుని సింగరేణి సంస్థలో బొగ్గు తీసే పనులను ఆ సంస్థ చేపట్టేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి ఆయన విజ్ఞప్తి చేశారు. సింగరేణిలో గత ప్రభుత్వంలాగే రాజకీయ జోక్యం పెరిగిందని ఆరోపించారు. సింగరేణి గుర్తింపు సంఘం ఏఐటీయూసీ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య మాట్లాడుతూ సింగరేణి ఎన్నికలు జరిగి ఏడాది కావస్తున్న ఇంత వరకు చైర్మన్ స్థాయి సమావేశం జరగలేదని, ఎన్నికల కోడ్ పేరుతో కార్మిక సంక్షేమాన్ని విస్మరిస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విలేకరుల సమావేశంలో ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి కె.రాజుకుమార్, కేంద్ర కమిటీ నాయకులు, బ్రాంచి కార్యదర్శులు ఎం.వెంకటస్వామి, మిర్యాల రంగయ్య, కె.సారయ్య, వైవీ రావు, మద్దిఎల్లయ్య, బాజీసైదా, వంగా వెంకట్, వై.రాంగోపాల్, అక్బర్ అలీ, వి.మల్లికార్జున్‌రావు, రాజరత్నయ్య, జి.వీరస్వామి, రమణమూర్తి, నజీర్ అహ్మద్, పోషం రవీందర్, మల్లేష్, సుధాకర్, కిషన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఇసుక చిచ్చు..

- దృష్టిసారించిన ముఖ్యమంత్రి
- 17 ర్యాంపుల అగ్రిమెంట్ ప్రక్రియకు బ్రేక్



ఇసుక ర్యాంపు

కొత్తగూడెం అర్బన్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): ఇసుక రీచ్‌ల కేటాయింపు చిచ్చు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి చేరింది. సీఎం దృష్టిసారించి ఇసుకర్యాంపులను నిలిపివేయాలని ఆదేశించడంతో అక్రమార్కులకు చెక్ పెట్టినట్లయింది. జిల్లాలో రీచ్‌ల ఏర్పాట్లపై సొసైటీ నిర్వాహకులకు, కార్యవర్గసభ్యుల మధ్య విభేదాలు చోటుచేసుకున్నాయి. ఈ పంచాయితీ సీఎం చెవిన పడటంతో ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది.

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా గోదావరి నది పరివాహక ప్రాంతాలైన భద్రాచలం, పినపాక డివిజన్‌లలో ఇసుక రీచ్‌ల ఏర్పాటు ప్రక్రియ ఆదివాసీ సొసైటీ నిర్వాహకులకు, కార్యవర్గసభ్యులకు మధ్య చిచ్చు పెట్టింది. పినపాక డివిజన్‌లోని 8, భద్రాచలం డివిజన్‌లోని 9 ర్యాంపుల ఏర్పాటు విషయంలో చోటుచేసుకుంది. ఈవిషయమై ప్రజాభిప్రేయ సేకరణలో నిర్వాహకులకు, గిరిజనులకు మధ్య విభేదాలు తలెత్తాయి. ఏజెన్సీలో ఆదివాసీ సొసైటీలతోనే ఇసుక రీచ్‌ల నిర్వహించాలని ప్రభుత్వ లక్ష్యం. ఈ మేరకు గిరిజన సొసైటీలకు అనుమతులు ఇచ్చిన ప్రభుత్వం కొంత రాయల్టీ పొందుతుంది. సొసైటీలలో గతంలో చెయ్యి తిరిగిన ఇసుక బినామీ కాంట్రాక్టర్లు జోక్యం చేసుకుని వారి చేతికి దక్కించుకునేందుకు ప్రయత్నాలు సాగించారు. 17రీచ్‌లలో ఇదే పరిస్థితి కొనసాగడంతో జిల్లాలో సర్వత్రా చర్చ సాగింది. ఇసుక రీచ్‌లు గత ప్రభుత్వం హయంలో పొందిన కాంట్రాక్టర్లు తిరిగి గిరిజన సొసైటీల ద్వారా ఇప్పుడు తీసుకోవాలని పకడ్బంది వ్యూహంతో రంగంలోకి దిగారు. పినపాక, సాంబాయిగూడెం నుంచి మొదలుకుని బూర్గంపాడు, గొమ్ముగూడెం, దుమ్ముగూడెం గోదావరి ఒడ్డు ప్రాంతంలో ఇసుక వ్యాపారానికి తెరలెపేందుకు సర్వం సిద్ధం (మిగతా 6వ పేజీలో)

ఇసుక క్వారీల్లో తనిఖీలు

- రికార్డులు పరిశీలించిన టీఎస్‌ఎండీసీ అధికారులు
- రాబోయే ఇసుక పాలసీపై వివరాల సేకరణ

7

డిపెండెంట్ల వయోపరిమితి పెంపు

- ఇక నుంచి 40 ఏళ్లున్నా ఉద్యోగాలు
- ఉత్తర్వులు జారీ చేసిన సింగరేణి యాజమాన్యం

ఇల్లెందు, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): సింగరేణి కాలరీస్‌లో డిపెండెంట్ ఉద్యోగాల నియామకాలకు సంబంధించి వయో పరిమితిని 35 నుంచి 40 సంవత్సరాలకు పెంచుతూ యాజమాన్యం ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు సింగరేణి కాలరీస్ జనరల్ మేనేజర్ (పర్సనల్) సీఆర్‌పీ/పీఈఆర్/ఐఆర్/సీ/081/176తేదీ: 5-2-2025న ఉత్తర్వులు జారీ చేశారు. సింగరేణిలో కారుణ్య నియామకాల ఉద్యోగ పరిమితిని 35 నుంచి 40 సంవత్సరాలకు పెంచుతూ ఇదివరకే యాజమాన్యం నిర్ణయం తీసుకుంది. కాగా బుధవారం సాయంత్రం (మిగతా 6వ పేజీలో)

కేఎంసీలో ఫైల్స్ మాయాజాలం

- అధికారుల ఫైల్స్ కాంట్రాక్టర్ల చేతిలోకి...
- సీసీ కెమెరాలో తతంగం నమోదు

7

సంపూర్ణ ఆరోగ్యం అందరి హక్కు

- అంకితభావంతో వైద్య సేవలందించాలి
- ప్రభుత్వ ఆస్పత్రిలో ఎన్సీడీ క్లినిక్‌ను ప్రారంభించిన కలెక్టర్



క్లినిక్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, పక్కన డీఎంహెచ్‌వో

ఖమ్మం కలెక్టరేట్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): సంపూర్ణ ఆరోగ్యం ప్రతి ఒక్కరి హక్కని, సర్కారు వైద్యశాలల్లో వైద్యులు అంకితభావంతో పనిచేసి రోగులకు మెరుగైన వైద్యసేవలను అందించాలని ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ అన్నారు. గురువారం ఆయన జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రిలో ఎన్సీడీ క్లినిక్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వ దవాఖానాలో అన్ని రకాల వైద్య సేవలు అందుబాటులోకి తెస్తున్నామని అన్నారు. అసంక్రమిత వ్యాధుల నివారణ కార్యక్రమం కింద జిల్లా ఆస్పత్రిలో ఎన్సీడీ క్లినిక్ విభాగం ఏర్పాటు చేసి రక్తపోటు, వృద్ధాప్య సేవలు, మానసిక సమస్యలు, కిడ్నీ, కాలేయ సమస్యలు, నోటి సమస్యలు, క్యాన్సర్, మధుమేహం, గుండె సంబంధిత వ్యాధులు, పక్షవాత నివారణకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఎన్సీడీ క్లినిక్ ద్వారా గర్భాశయ ముఖ ద్వారం క్యాన్సర్ (సర్వికల్ క్యాన్సర్), రొమ్ము, నోటి క్యాన్సర్, మధుమేహం, పక్షవాతం, గుండెపోటుకు ఎటువంటి చికిత్స తీసుకోవాలి, వ్యాధి గుర్తింపు వంటి అంశాలపై దృష్టి సారించి పని చేస్తుందన్నారు.

మల్లుపల్లికి మృతదేహాలు

- కడసారి వీడ్కోలుకు తరలి వచ్చిన ప్రజలు
- ఆత్మీయుల కన్నీటి నడుమ పూర్తయిన అంత్యక్రియలు



మృతదేహాలను ఊరేగింపుగా తీసుకెళుతున్న గ్రామస్థులు

కొణిజర్ల, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో కూలి పనులకు వెళ్లి సెల్లార్‌లో పని చేస్తుండగా మట్టిదిబ్బలు మీద పడి మృతి చెందిన ఆళ్లకుంట వీరయ్య, అతడి కుమారుడు రాము, మేనల్లుడు ముద్దంగుల శ్రీనివాస్ మృతదేహాలను గురువారం సాయంత్రం స్వగ్రామం కొణిజర్ల మండలం మల్లుపల్లికి బంధువులంతా వెళ్లి తీసుకొచ్చారు. అంబులెన్స్ ద్వారా వచ్చిన మృతదేహాలను కొణిజర్ల నుంచి మల్లుపల్లి వరకు ఊరేగింపు నిర్వహించి కన్నీటితో బంధువులు, స్నేహితులు, గ్రామస్థులు అంతక్రియలను నిర్వహించారు. ఆళ్లకుంట వీరయ్య కుటుంబంతో సహా హైదరాబాద్‌కు పనులు చేసేందుకు వెళ్లారు. వారిలో వీరయ్య, కుమారుడు రాము, మేనల్లుడు శ్రీనివాస్‌లు సెల్లార్‌లో పని చేస్తుండగా మట్టిదిబ్బలు మీదపడి ఊపిరాడక అక్కడకుఅక్కడే మృతి చెందిన విషయం తెలిసిందే. జేసీబీ ద్వారా మట్టి దిబ్బలను తొలగించి మృతదేహాలను బయటకు తీసి అక్కడ పోలీస్‌లు పంచనామ చేశారు. అనంతరం మృతదేహాలను కుటుంబసభ్యులు, బంధవులు స్వగ్రామానికి తీసుకొచ్చారు. గ్రామంలో స్నేహితులు, గ్రామస్థులు వారికి ఉన్న మంచితనం చూసి ఫ్లెక్సీలను ఏర్పాటు చేసి చివరి వీడ్కోలు పలికారు.

మిన్నంటిన రోదనలు..

ఆళ్లకుంట వీరయ్యకు భార్య రాధమ్మ, కుమారులు శ్రీను, రాము ఉన్నారు. వారితో పాటు రాధమ్మ అన్న ముద్దంగుల క్రిష్ణ, అతడి భార్య తిరుపతమ్మ, వారి కుమారులు శ్రీనివాస్, (మిగతా 6వ పేజీలో)



ఏఆర్ ఎస్‌ఐ లక్ష్మీనర్సు(ఫైల్)

6

ఏఆర్ ఎస్‌ఐ బలవన్మరణం

ములుగు జిల్లా పస్రాలో ఘటన



సదస్సులో మాట్లాడుతున్న చైర్మన్ వేణుగోపాలచారి

విద్యుత్ సమస్యలను సత్వరమే పరిష్కరించాలి

ఏన్కూరు, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ వినియోగదారుల సమస్యలను సత్వరమే పరిష్కరించాలని టీజీ ఎస్పీడీసీఎల్ విద్యుత్ వినియోగదారుల ఫోరం చైర్మన్ ఎన్. వేణుగోపాలాచారి పేర్కొన్నారు. గురువారం స్థానిక విద్యుత్ ఉపకేంద్రంలో వినియోగదారుల సమస్యల పరిష్కారం వేదిక సదస్సు జరిగింది. ఈ సదస్సులో ఏన్కూరు, తల్లాడ, మండలాలకు చెందిన వినియోగదారులు తమ సమస్యలు విన్నవించారు. ఈ సందర్భంగా వేణుగోపాలచారి మాట్లాడుతూ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించకపోవడమే సమస్యలకు కారణమన్నారు. ఇకనైనా అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. సిబ్బంది గ్రామస్థాయిలో తలెత్తే సమస్యలను ఎప్పటికప్పుడు ఉన్నతాధికారుల దృష్టికి తేవాలని కోరారు. పెండింగ్ సమస్యలపై అసహనం వ్యక్తం చేశారు. సదస్సుకు ఎక్కువమంది హాజరుకాకపోవడం, సదస్సుపైవిస్తృతప్రచారం ఎందుకు చేయలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో టీజీఎస్పీడీసీఎల్ టెక్నికల్ మెంబర్ కె.రమేష్, ఫైనాన్స్ మెంబర్ చరణ్‌దాస్, ఇండిపెండెంట్ మెంబర్ రామారావు, డీఈ రాములు, ఏడీ సతీష్, ఏఈలు ఉమాకాంత్, ప్రసాద్, కృష్ణకాంత్ పాల్గొన్నారు.

ట్రాన్స్‌జెండర్ల ఉపాధికి బాటలు

- మెప్మా పరిధిలో 82 మందిలో 40మందికి స్వయం ఉపాధి బాట
- సత్తుపల్లిలో ఒకటి, ఖమ్మంలో 3 సంఘాల ఏర్పాటు, రుణాలు మంజూరు
- రాష్ట్రంలోనే ఆదర్శంగా ఖమ్మం జిల్లా
- ఖమ్మం కలెక్టర్, కమిషనర్ ప్రత్యేక చొరవ

ఖమ్మం సంక్షేమవిభాగం, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): సమాజంలో ట్రాన్స్‌జెండర్లకు సరైన గౌరవంతో పాటు ఉపాధికి బాటలు వేసేందుకు, ఆర్థిక ఇబ్బందులను తొలగించేందుకు కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ ఆదేశాలతో ఖమ్మం జిల్లాలోని ట్రాన్స్‌జెండర్లకు మెప్మా ఆధ్వర్యంలో ఉపాధి బాటలు పడుతున్నాయి. రాష్ట్రంలోనే పైలెట్ ప్రాజెక్టుగా జిల్లాలో ట్రాన్స్‌జెండర్ సంఘాలను వరసగా ఏర్పాటు చేస్తున్నారు. ప్రారంభంలో బ్యాంకు ఖాతాల నమోదు నుంచి సంఘాల ఏర్పాటు వరకు అనేక ఇబ్బందులను ఎదుర్కొన్న మెప్మా సిబ్బంది తర్వాత కాలంలో ట్రాన్స్‌జెండర్లతో ప్రత్యేక సమావేశాలను ఏర్పాటు చేసి వారికి మనోధైర్యం కల్పిస్తూ బ్యాంకర్లతో మాట్లాడి రుణాలను సైతం అందిస్తున్నారు.

ఖమ్మం జిల్లాలో నాల్గొవ సంఘం ఏర్పాటు

ఖమ్మం, సత్తుపల్లి, మధిర, వైరా మునిసిపాలిటీల పరిధిలోని మెప్మా ఆధ్వర్యంలో ఆర్పీలు ఇంటింటి సర్వే నిర్వహించగా.. ఖమ్మంలో 55, మధిరలో 7, సత్తుపల్లిలో 14, వైరాలో ఆరుగురు.. మొత్తం 82మంది ట్రాన్స్‌జెండర్లను గుర్తించారు. మెప్మా పీడీ మహేందర్, డీఎంసీ సుజాత, టీఎంసీ సుజాత ఆధ్వర్యంలో మునిసిపాలిటీల వారీగా ట్రాన్స్‌జెండర్లతో సమావేశాలు నిర్వహించారు. సమావేశాలకు ట్రాన్స్‌జెండర్లు రాకపోవటంతో వారి పెద్దలతో మాట్లాడి అంగీకరింపచేశారు. ప్రతి ట్రాన్స్‌జెండర్‌ను బ్యాంకుకు తీసుకెళ్లి వారితో వ్యక్తిగత బ్యాంకు ఖాతాలను నమోదు చేయించారు. ఖమ్మం నగర పాలక సంస్థ కమిషనర్ అభిషేక్ అగస్త్య ప్రత్యేక పర్యవేక్షణలో ఖమ్మంలో 55మంది ట్రాన్స్‌జెండర్లు ఉండగా వారిలో 30 మందికి స్వయం సహాయక సంఘాలుగా నిర్మాణం చేసి 20 మందితో అర్ధనారీశ్వర, విశ్వం రెండు ఎస్‌హెచ్‌జీ సంఘాలుగా ఏర్పాటు చేసి మెప్మా నిబంధనల మేరకు ఒక్కో సంఘానికి రూ.3లక్షల చొప్పున రూ.6లక్షల బ్యాంకు రుణాలను అందించారు. మూడో సంఘంగా సంతోషి మహిళా స్వయం సహాయక సంఘాన్ని ఏర్పాటు చేసి ఆ సంఘానికి వారం రోజులు లోపుగానే రూ.3లక్షల బ్యాంకు రుణాలను అందించేందుకు కృషి చేస్తున్నారు. సత్తుపల్లిలో మాతా మహిళా స్వయం సహాయక సంఘాన్ని ఏర్పాటు చేసి రూ.7లక్షల రుణాలను పొందారు. వారితో డైరీ ఫామ్‌ను ఏర్పాటు చేయించారు.



ట్రాన్స్‌జెండర్ల సమావేశంలో మాట్లాడుతున్న టీఎంసీ సుజాత

డైరీ ఫామ్ నిర్వహణతో 10 మంది ట్రాన్స్‌జెండర్లు ఉపాధిని పొందుతున్నారు. ఇలా జిల్లా వ్యాప్తంగా మెప్మా పరిధిలో 82 మందిని గుర్తించగా వారిలో 40 మంది ట్రాన్స్‌జెండర్లు సంఘాలుగా ఏర్పడి స్వయం ఉపాధి దిశగా అడుగులు వేస్తున్నారు. మిగిలిన వారిని సంఘాలుగా ఏర్పాటు చేసేందుకు మెప్మా ఆధ్వర్యంలో కార్యాచరణ కొనసాగిస్తున్నారు.

క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదం

- భద్రాద్రి ఎస్పీ రోహిత్‌రాజ్
- జిల్లా పోలీస్ వార్షిక స్పోర్ట్స్ మీట్ ప్రారంభం



కొత్తగూడెం, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదపడతాయని భద్రాద్రి ఎస్పీ రోహిత్‌రాజ్ అన్నారు. గురువారం జిల్లా పోలీస్ హెడ్‌క్వార్టర్స్ హేమచంద్రాపురంలో పరేడ్ మైదానంలో జిల్లా పోలీస్ యాన్యువల్ స్పోర్ట్స్ మీట్ ఘనంగా ప్రారంభమైంది. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా విచ్చేసిన జిల్లా ఎస్పీకి భద్రాచలం ఏఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్ పుష్పగుచ్ఛంతో స్వాగతం పలికారు. క్రీడా జ్యోతిని ఎస్పీ వెలిగించి క్రీడాకారులకు అందజేశారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి ఎస్పీ మాట్లాడుతూ.. జిల్లా పోలీస్ శాఖలో విధులు నిర్వహించే అధికారులు, సిబ్బంది సమర్థవంతంగా పనిచేస్తున్నారని, విధుల నిర్వహణలో నిరంతరం సేవలు అందిస్తున్న పోలీసులకు ఆటవిడుపు, మానకోల్లాసానికి క్రీడలు నిర్వహించమన్నారు. పోలీస్ క్రీడల్లో క్రికెట్, వాలీబాల్, చెస్, క్యారమ్స్, టగ్ ఆఫ్ వార్, కబడ్డీ, షటిల్, బాడ్మింటన్, అథ్లెటిక్స్, 5కే పరుగుపందెం వంటి క్రీడలు నిర్వహిస్తున్నామన్నారు. గెలుపు, ఓటములకు తావులేకుండా స్పోర్టింగ్ స్పిరిట్‌తో ఆటలు ఆడాలన్నారు. తొలుత హోంగార్డ్స్ టీమ్, పాల్వంచ సబ్ డివిజన్ మధ్య వాలీబాల్ మ్యాచ్‌ను టాస్ వేసి ప్రారంభించారు. జిల్లా పోలీస్ కార్యాలయ టీం, ఇల్లెందు సబ్ డివిజన్ టీం మధ్య ఉత్కంఠభరితంగా జరిగిన క్రికెట్ మ్యాచ్ చూపరులను ఆకట్టుకుంది. క్రికెట్‌లో జిల్లా ఎస్పీ బోలింగ్ చేసి ఉత్సాహం నింపారు.



క్రీడాకారులతో భద్రాద్రి ఎస్పీ రోహిత్‌రాజ్

పెరటి సాగు.. లాభాలు బాగు

మణుగూరు టౌన్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): నానాటికి పెరుగుతున్న కూరగాయాల ధరలు సామాన్యుడి నడ్డి విరిస్తున్నాయి. ఎక్కువ కుటుంబాల్లో మహిళలు వంటింటి బడ్జెట్‌ను సర్దుబాటు చేసుకోలేక సతమతం అవుతున్నారు. మండలంలోని పలు గ్రామాల్లో కొందరు తమ ఇండ్లలోనే కొద్ది పాటి పెరడులో శ్రద్ధతో కూరగాయాలు,ఆకుకూరలు , మొక్కల పెంపకం చేపడుతున్నారు. ఈ పెరటి పని వల్లశారీరక మానసిక ఆరోగ్యాన్ని అనుభవిస్తున్నారు. వేసవిలోనూ పెరటి తోటలు సాగు చేస్తు పలువురు ఆదర్శంగా నిలుస్తున్నారు. వ్యవసాయ పరంగా చెప్పుకోదగిన స్థాయిలో ఆదర్శ రైతులు మండలంలో లేనప్పటికీ కొన్ని గ్రామాలు మాత్రం పెరటి సాగులో ఆదర్శంగా నిలుస్తున్నాయి. మండలంలోని రామానుజవరం ఆకు కూర సాగులో జిల్లాకే ఆదర్శంగా నిలుస్తోంది. ఈ గ్రామంలో



పేద రైతులు పది సెంట్ల నుంచి అర ఎకరం విస్తీరణంలోనే రూ 20 వేలనుంచి లక్ష వరకు సంపాదిస్తున్నారు. కొండాయిగూడెం శ్రీకృష్ణాపురం సాంబాయిగూడెం కమలాపురం తదితర గ్రామాల్లో కూరగాయాల సాగు జరుగుతుంది. రైతులు ఖరీఫ్ పంటలు పూర్తి అయిన తర్వాత కూరగాయాలను పండించడం ద్వారా మంచి ఆదాయాన్ని పొందుతున్నారు.

ఇంటిపెరడులోనే సాగు చేయవచ్చు



లేళ్ల కుమారి, మహిళా రైతు, రామానుజవరం

కూరగాయలు పెంచాలంటే ప్రణాళికలు అవసరం లేదు. ఇంటి చుట్టూ ఉన్న కంచెలు, గోడలు కూడా కూరగాయల సాగుకు చాలు. నాడు ప్రతి ఇంటిలో విధిగా కూరగాయల సాగు చేసేవారు. నేడు హంగు ఆర్భాటాలకే ప్రాధాన్యం ఇస్తున్నారు. పెరటిలో కూరగాయల సాగుతో ఆదాయం వస్తుంది.

ఎన్నడూ కూరగాయలు కొనలేదు...



ఎల్. భద్రయ్య, రైతు రామానుజవరం

బయటి కూరగాయల ధరలు నాకు తెలియదు.. నేను ఎన్నడూ కూరగాయలు కొనలేదు. అన్నిరకాల కూరగాయాలు మా పెరడులోనే ఉంటాయి. చుట్టు పక్కల వారికి పంచి పెడతాం.. నలుగురితో పంచుకోవడం ఎంతో ఆనందంగా ఉంది.

ఇసుక చిచ్చు..

(5వ పేజీ తరువాయి)

చేసుకున్నారు. ఈ వ్యవహారంపై కాంగ్రెస్ పార్టీలోనే తీవ్రస్థాయిలో చర్చకు దారితీసింది. తొలుత ఆదివాసీ సొసైటీలకు కేటాయింపు ప్రక్రియను ప్రభుత్వం ప్రారంభించారు. ఈక్రమంలో జిల్లాను పైలెట్ ప్రాజెక్టుగా ఎంపికచేసింది. ఇసుక రీచ్‌ల కేటాయింపుకు పర్యావరణ అనుమతులు అనంతరం జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ నేతృత్వంలో డిస్ట్రిక్ లెవల్ శాండ్ కమిటీ(డీఎల్‌సీ) అమోదించి టీఎస్‌యండీసీకి ఈసీసీఎఫ్ సమర్పించడంతో టీఎస్‌యండీసీకి ఫైల్ సిపారసు చేశారు.

ఈనేపథ్యంలో పెసా చట్టం ప్రకారం ఆదివాసీ సొసైటీ, టీఎస్‌యండీసీ అధికారులు అగ్రిమెంట్ ప్రక్రియ ప్రారంభం కాకుండానే సొసైటీ నిర్వాహకుల మధ్య విభేదాలు, అనుమానాలు తలెత్తడటంతో సీఎం రేవంత్‌రెడ్డికి ఫిర్యాదులు వెల్లువెత్తాయి.

సీఎం ఆదేశాలతో సీఎంవో నుంచి జిల్లా అధికారయంత్రాంగానికి రీచ్‌ల ఏర్పాటు ప్రక్రియ నిలిపివేయాలని ఆదేశాలు జారీచేయడం గమనార్హం. ప్రస్తుతం ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులో ఉండటం, ప్రజల నుంచి అభిప్రాయ సేకరణలో విభేదాలు బేదాలు రావడంతో ఈ ప్రక్రియ ఆలస్యం అవుతుందని సమాచారం.

జిల్లాలో అసలు ప్రారంభానికి నోచుకోని రీచ్‌లపై సీఎం దృష్టికి ఫిర్యాదులు వెళ్లడంలో అంతర్యమేమిటో ఇట్టే అర్థం చేసుకోవచ్చు.

మల్లుపల్లికి మృతదేహాలు

(5వ పేజీ తరువాయి)

శ్రీమంతులు ఉన్నారు. తిరుపతమ్మ గత ఏడాది చనిపోయింది. క్రిష్ణ కూడ కుమారులను పట్టించుకోకపోవడంతో వీరయ్య తన కుటుంబ సభ్యులతో పాటు మేనల్లులను కూడ హైదరాబాద్ పనులకు తీసుకెళ్లారు. సంఘటన జరిగిన రోజు వీరయ్య, చిన్నకుమారుడు రాము, మేనల్లుడు శ్రీనివాస్ ఓ సెల్లార్ పనికి వెళ్లారు. మిగిలిన కుటుంబసభ్యులు మరో పనికి వెళ్లారు. ప్రమాదం జరగటంతో కుటుంబసభ్యులంతా అక్కడకు చేరుకొని కన్నీటిపర్యంతమయ్యారు. స్వగ్రామం మల్లుపల్లికి విషయం తెలియడంతో బంధవులు కొంతమంది హైదరాబాద్‌కు తరలివెళ్లారు. అక్కడ కార్యక్రమాలను చూసుకొని మృతదేహాలను మల్లుపల్లికి తీసుకొచ్చారు. మృతదేహాలు గ్రామంలోకి రాగానే గ్రామస్థులు, స్నేహితులు, బంధవులు బోరున విలపించారు. ఊరేగింపుగా కడ వరకు తీసుకెళ్లి అంతక్రియలు నిర్వహించారు.

పోటెత్తిన ఎర్ర బంగారం

ఖమ్మంమార్కెట్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగరంలోని వ్యవసాయ మార్కెట్‌కు ఎర్రబంగారం (తేజా రకం కొత్త మిర్చి) పోటెత్తింది. గురువారం సుమారు 80 వేల మిర్చి బస్తాలు అమ్మకానికి వచ్చాయి. కొత్త మిర్చి సీజన్ ప్రారంభమయ్యాక తొలిసారిగా పంట ఇంత భారీమొత్తంలో రావడం ఇదే ప్రథమం. మార్కెట్‌కు మూడు రోజుల క్రితం 60వేల బస్తాలు రాగా, ప్రస్తుతం రైతులు పంటను సుమారు 80వేల బస్తాల వరకు భారీగా అమ్మకానికి తెచ్చారు. మార్కెట్‌కు ఉమ్మడి ఖమ్మం జిల్లాతో పాటు మహబూబాద్, సూర్యాపేట, ఏపీలోని ఎన్టీఆర్ జిల్లాల రైతులు పంటను అమ్మకానికి తీసుకొస్తున్నారు. దీంతో మిర్చి యార్డులు గురువారం ఉదయం 7 గంటలకే హౌస్‌ఫుల్ అయ్యాయి. ఇదిలా ఉండగా మార్కెట్లో క్వింటాలు మిర్చి రూ.14,025 జెండాపాట ధరగా నిర్ణయించారు. వ్యాపారులు మిర్చి నాణ్యతను బట్టి క్వింటాలు కనిష్టంగా రూ.6,000, గరిష్టంగా రూ.13,700 వరకు వ్యాపారులు కొనుగోలు చేశారు. అంతే కాకుండా మార్కెట్‌కు కోల్డ్‌స్టోరేజీలలో నిల్వ ఉంచిన సుమారు 184 శాంపిల్ ఏసీ మిర్చి బసాలు రాగా అత్యధిక ధర క్వింటాలుకు రూ.13,300 పలికింది. నాణ్యతను బట్టి వ్యాపారులు క్వింటాలు ఏసీ మిర్చిని రూ.6,000 నుంచి రూ.12,100 వరకు కొనుగోలు చేశారు. మిర్చి కొనుగోళ్లను మార్కెట్ కమిటీ చైర్మన్ యరగర్ల హన్మంతరావు, వైస్ చైర్మన్ తల్లాడ రమేష్, సెక్రెటరీ ప్రవీణ్‌రెడ్డి, గ్రేడ్‌టూ సెక్రెటరీ సృజన్‌బాబు, అసిస్టెంట్ సెక్రెటరీ వీరాంజనేయులు తదితరులు సమీక్షించారు.

గద్దర్ కుమార్తెకు ఆత్మీయ పురస్కారం

(5వ పేజీ తరువాయి)

ఎంతో ఉపయోగపడతాయని వాటిని పరిరక్షించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. పిల్లలను సెల్‌ఫోన్లకు దూరంగా ఉంచండని తల్లిదండ్రులకు హితబోధ చేశారు.

తెలంగాణ ప్రభుత్వ ఉత్తమ గేయరచయిత అవార్డుగ్రహీత ఎస్.పాల్ నిర్వహించిన పాటల సందడి ఆకట్టుకుంది. అనంతరం ఆయనకు ఆత్మీయ సత్కారం చేశారు. జిల్లాలోని అనిశెట్టిపల్లికి చెందిన రమేష్ మిమిక్రీ ఆహూతులను ఎంతగానో ఆకట్టుకుంది.

అలరించిన ఇంద్రప్రస్థం నాటిక

నాటకోత్సవాల్లో భాగంగా ప్రదర్శించిన ఇంద్రప్రస్థం నాటిక ప్రేక్షకులను ఆకట్టుకుంది. గోపి సత్య ప్రకాష్ రచించగా, ఎస్.రవీంద్రనాథ్‌రెడ్డి దర్శకత్వం వహించారు. నాటికలో భాగంగా ప్రేమ అనేది సృష్టిలో గొప్పదే కాని ఆ ప్రేమలు హర్షించేవిధంగా కన్పించాలే తప్ప అనాలోచితంగా వెర్రిగా పరిగెడితే జీవితం విలువలు నాశనమవుతాయని వివరిస్తూ నాటిక కొనసాగింది. ఈ ముగింపు వేడుకల్లో తాళ్లూరి ట్రస్టు చైర్మన్ తాళ్లూరి పంచాక్షరయ్య, వల్లూరిపల్లి వంశీకృష్ణతో పాటు భద్రాద్రి కళాభారతికి చెందిన అల్లం నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఓటు బలమైన ఆయుధం..: డా. వెన్నెల

ఓటు హక్కుపై సారథి కళాకారులు విస్తృత ప్రచారం చేయాలని తెలంగాణ సాంస్కృతిక సారథి చైర్‌పర్సన్ జీవీ వెన్నెల అన్నారు. గురువారం ఖమ్మం వైరా రోడ్‌లోని వేదిక ఫంక్షన్ హాల్‌లో కవి గాయకుడు యశ్‌పాల్ అధ్యక్షతన ఎమ్మెల్సీ ఓటు హక్కు దాని ప్రాధాన్యం అనే అంశంపై సదస్సు జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ.. బీఆర్ అంబేద్కర్ ప్రసాదించిన ఓటు హక్కుతో ప్రజాస్వామ్య విలువను మరింత పెంచాలన్నారు. డబ్బుకు, కులానికి, మద్యానికి, ఇతర ప్రలోభాలకు ఓటును బలిచేయవద్దన్నారు. విద్యావంతుల నియోజక వర్గ ఎన్నికల్లో విద్యావంతులందరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. గ్రామాల్లో చదువురాని వారు ఓటును చక్కగా వినియోగించుకుంటుంటే నగరాల్లో విద్యావంతులు ఓటు హక్కు పట్ల కొంత ఉదాసీనత వ్యక్తం చేస్తుండటం బాధాకరం అన్నారు. ఓటు హక్కు వినియోగంలో విద్యావంతులు అందరికీ ఆదర్శంగా ఉండాలన్నారు. ఓటు బలమైన ఆయుధమని దానిని సమర్థవంతంగా వినియోగించుకోవాలని చెప్పారు.

ఈ సందర్భంగా యశ్‌పాల్ మాట్లాడుతూ సారధికళాకారుల ఆధ్వర్యంలో ఖమ్మం, కొత్తగూడెం జిల్లాల్లో విస్తృత ప్రచారం చేస్తున్నామని చెప్పారు.

ఆటపాటల ద్వారా ఓటుహక్కుపై ప్రచారం నిర్వహిస్తున్నామన్నారు. ఈసందర్భంగా కవులు దేవేంద్ర, జీవన్, కళాకారుల సంఘం నాయకులు డాక్టర్ నాగబత్తిని రవి, సుబ్రమణ్యకుమార్, కళాకారులు కాల్వకట్ల జాన్, పాగి వెంకన్న, బొమ్మెర ముత్యం, రఘు, రాధాకృష్ణ, రాము, పుల్లారావు తదితరులు పాల్గొని సాంస్కృతిక సారథి చైర్‌పర్సన్ వెన్నెలను శాలువాలు, పూల బొకేలతో ఘనంగా సన్మానించారు.

కమ్మ మహాజన సంఘం ఎన్నికలు ఏకగ్రీవం

- అధ్యక్ష, కార్యదర్శులుగా రఘు, రాము

ఖమ్మం ఖానాపురం హవేలీ,ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): కమ్మ మహాజన సంఘం ఎన్నికలు ఏకగ్రీవం అయ్యాయి. సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా కొల్లు రఘు సత్యనారాయణ, చావా రాములు తోపాటు కోశాధికారిగా తుళ్లూరి నిర్మలాకుమారి తోపాటు కార్యవర్గ సభ్యులందరూ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని ఎన్నికల అధికారి నల్లమల నవీన్ చైతన్య, సహాయ ఎన్నికల అధికారి మేదరమట్ల సుబ్బయ్య తెలిపారు. ఈ నెల 4వతేదీన నామినేషన్ల ప్రక్రియ నిర్వహించామని, గురువారం ఉపసంహరణ గడువు ముగిసిన అనంతరం అన్ని పోస్టులకు ఒక్కొక్క నామినేషన్ మాత్రమే ఉండటంతో అందరూ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారులు ప్రకటించారు. నూతన కమిటీ సభ్యులు ఖమ్మం జిల్లా కేంద్రంలోని స్వర్ణభారతి కల్యాణ మండపంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. సంఘం అభివృద్ధికి సంఘం పెద్దల సలహాలు, సూచనలతో కృషి చేస్తామని, సంఘం ప్రతిష్ఠను మరింత ఇనుమడింప చేస్తామన్నారు. సమాజ అభివృద్ధిలో సంఘం కీలకంగా ఉండేలా పనిచేస్తామన్నారు.



రఘు



రాము

ఈ కార్యక్రమంలో నూతనంగా ఎన్నికైన సభ్యులు వైస్ ప్రెసిడెంట్ కర్నాటి రమాదేవి, జాయింట్ సెక్రెటరీ వజ్జా శ్రీనివాసరావు, కార్యవర్గ సభ్యులుగా మోతుకూరి సత్యనారాయణ, తుమ్మలపల్లి నాగేశ్వరరావు, మేదరమట్ల స్వరూపరాణి, నంబూరి సత్యనారాయణ ప్రసాద్, పోలీనేని భూమేశ్వరరావు, నల్లమల్ల ఆనంద్, కోలేటి నవీన్‌కుమార్, సంఘం పెద్దలు పోట్ల నాగేశ్వరరావు, సామినేని హరిప్రసాద్, రావూరి సైదబాబు, పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సభ్యులు

దొంగ డెత్ సర్టిఫికెట్‌తో..

బీమా సొమ్ము స్వాహా?

- సారపాకలో చోటుచేసుకున్న ఘటన
- పంపకాల తేడాతో...ఆలస్యంగా వెలుగులోకి

బూర్గంపాడు, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): మనిషి బతికి ఉండగానే చనిపోయినట్లుగా దొంగ డెత్ సర్టిఫికెట్ సృష్టించి బీమా సొమ్ము కాజేసిన ఘటన సారపాకలో చేసుకుంది. ఈ ఘటన గురువారం రాత్రి ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం.... బూర్గంపాడు మండలం సారపాక గ్రామపంచాయతీ పరిధిలోగల భాస్కరనగర్‌కు చెందిన శ్రీరాములు అనే వ్యక్తి బతికి ఉండాగానే చనిపోయినట్లుగా దొంగ డెత్ సర్టిఫికెట్ సృష్టించి రూ.10లక్షల ఎల్ఐసి బీమా సొమ్మును నొక్కేసిన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. ఈ ఘటనలో ఎల్ఐసీ ఏజెంట్ కీలకంగా వ్యవహరించినట్లు తెలుస్తోంది. శ్రీరాములు బతికి ఉండగానే చనిపోయినట్లుగా ఏపీలోని కుక్కునూరు నుంచి డెత్ సర్టిఫికెట్ సృష్టించి ఓ ఎల్ఐసీ ఏజెంట్, మరో ఇరువురు వ్యక్తులు కలిసి ఈ వ్యవహారాన్ని నడిపించినట్లు సమాచారం. శ్రీరాములు కొంత కాలం క్రితం చనిపోయినట్లుగా భద్రాచలం ఎల్ఐసీ ఆఫీసులో డెత్ సర్టిఫికెట్ అందజేసి రూ.10లక్షల బీమా సొమ్మును రెండు నెలల క్రితం తీసుకున్నట్లు తెలుస్తోంది. డబ్బుల పంపకాల విషయంలో ఘర్షణ జరగడంతో విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.

టైగర్ భద్ర..!

(5వ పేజీ తరువాయి)

అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా అటవీశాఖ అధికారి క్రిష్ణ గౌడ్ 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ.. సుమారు మూడు నెలలుగా పెద్దపులి భద్రాద్రి కొత్తగూడెం, ములుగు జిల్లా సరిహద్దు అటవీ ప్రాంతంలో సంచరిస్తోందని, ఇక్కడ తిరుగుతున్న పెద్దపులి మగ పులిగా గుర్తించి భద్ర అని పేరు నామకరణం చేసినట్లు తెలిపారు. ప్రస్తుతం సరిహద్దులో ఆవాసం ఉంటోందని, అటవీ శాఖ అధికారులు పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు.

ఏఆర్ ఎస్ఐ బలవన్మరణం

పినపాక, ఫిబ్రవరి (ఆంధ్రజ్యోతి): భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పినపాక మండలంలోని ఏడూళ్లబయ్యారం సర్కిల్ పోలీస్ స్టేషన్‌లో టీజీ స్పెషల్ పార్టీ ఆర్మ్‌డ్ రిజర్వ్ ఎస్ఐ గా విధులు నిర్వహిస్తున్న సువర్ణపాక లక్ష్మీనర్సు (38 సం) ములుగు జిల్లా పస్రాలో గురువారం తెల్లవారుజామున ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. గత రెండు రోజుల క్రితం విధులకు సెలవుపెట్టి వెళ్లిన ఏఆర్ ఎస్ఐ లక్ష్మీనర్సు కుటుంబ కలహాల నేపథ్యంలోనే ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలుస్తోంది. కాగా మృతుడి భార్య సునీత గోవిందరావుపేటలో ఉపాధ్యాయురాలిగా పని చేస్తోంది. వీరికి ఇద్దరు పిల్లలున్నారు.

కలెక్టర్‌ను కలిసిన ఇంటెలిజెన్స్ అధికారి

ఖమ్మం కలెక్టరేట్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రాంతీయ ఇంటెలిజెన్స్ అధికారి రామోజీ రమేష్ గురువారం జిల్లా కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్‌ని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఇంటెలిజెన్స్ డీఎస్పీయు. వెంకన్న బాబు, ఇన్స్పెక్టర్లు సీహెచ్. శ్రీనివాసరావు, ప్రసాదరావు, ఏ ఎస్సై శ్రీనివాసరావు తదితరులున్నారు.



కలెక్టర్‌ను కలిసిన రామోజీ రమేష్

డిపెండెంట్ల వయోపరిమితి పెంపు

(5వ పేజీ తరువాయి)

సింగరేణిలో అన్ని ఏరియాల్లో అమలు చేయాలని యాజమాన్యం ఉత్వర్వులు విడుదల చేసింది. సింగరేణి కార్మికుడు మరణించి సందర్భంలో, మెడికల్ అన్‌ఫిట్ అయినప్పుడు వారి వారసుడికి 35 సంవత్సరాల లోపు వయసు ఉంటేనే గతంలో ఉద్యోగం ఇచ్చేవారు. కాగా బుధవారం విడుదల చేసిన ఉత్తర్వులతో 40 సంవత్సరాల వయసు ఉన్నా డిపెండెంట్‌లకు ఉద్యోగం ఇవ్వనున్నారు. 2018 మార్చి 9 నుంచి 2024 జూన్ 9 వరకు పెండింగ్‌లో ఉన్న డిపెండెంట్‌లకు సైతం ఈ కొత్త ఉత్తర్వులతో ఇప్పుడు ఉద్యోగాలు లభించనున్నాయి.

వయోపరిమితి 35 ఏళ్ల దాటి కొన్ని సంవత్సరాలుగా ఎదరు చూస్తున్న కారుణ్య నియామకాల పెండింగ్ డిపెండెంట్‌లకు తాజా సర్క్యులర్‌తో ఊరట లభించనుంది.

ఈ మేరకు సింగరేణి కాలరీస్ గుర్తింపు కార్మిక సంఘం(ఏఐటీయూసీ) రాష్ట్ర అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య, కార్యదర్శి రాజ్‌కుమార్, తాము గుర్తింపు సంఘంగా ఎన్నికైన తర్వాత యాజమాన్యంతో పలు మార్లు మాట్లాడి డిపెండెంట్ ఉద్యోగాల వయో పరిమితిని పెంచినట్లు చెప్పారు. ఎంతో కాలంగా ఎదురు చూస్తున్న కారుణ్య నియామకాల డిపెండెంట్‌ల సమస్యలను పరిష్కరించామని తెలిపారు.

ఇసుక క్వారీల్లో తనిఖీలు

చర్ల, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) చర్ల మండలంలోని మొగళ్లపల్లి, వీరాపురం ఇసుక క్వారీల్లో జిల్లా టీఎస్ఎండీసీ అధికారులు గురువారం తనిఖీలు చేపట్టారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఇసుక క్వారీల్లో ఓవర్‌లోడ్‌తో ఇసుక తరులుతుందన్న ఆరోపణల నేపథ్యంలో ఈ తనిఖీలు చేసినట్లు తెలుస్తోంది. రాష్ట్ర వ్యాప్తంగా ఇసుక పాలసీ మారుతున్న నేపథ్యంలో గిరిజన సొసైటీలకు ఏ విధంగా ఇసుక పాలసీ తీసుకొస్తే మేలు జరుతుందన్న దానిపై గిరిజనులతో టీఎస్ఎండీసీ అధికారులు వివరాలు సేకరించినట్లు సమాచారం. ఈ సందర్భంగా గిరిజనులు కూడా ఇసుక క్వారీ నిర్వహణలో నెల కొంటున్న సమస్యలను టీఎస్ఎండీసీ అధికారుల దృష్టికి తీసుకెళ్ళినట్లు తెలుస్తోంది. తనిఖీ విషయం టీఎస్ఎండీసీ పీవోని వివరణ కోరేందుకు ప్రయత్నించగా ఆయన ఫోన్ ఎత్తలేదు. అలాగే కొత్త ఇసుక పాలసీ నేపథ్యంలో చర్ల మండలంలో ప్రారంభానికి సిద్ధంగా ఉన్న ఇసుక క్వారీల ప్రొసీడింగ్‌ని ప్రభుత్వం నిలిపివేసింది. దీంతో ఆయా సొసైటీల పరిధిలోని గిరిజనులు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం పునరాలోచన చెయ్యాలని డిమాండ్ చేస్తున్నారు.

క్రీడలతో మానసిక ధృఢత్వం

ఎమ్మెల్యే కూనంనేని, కలెక్టర్ జితేష్

రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ పోటీల ప్రారంభం

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): క్రీడలతోనే మానసికంగా ధృడంగా ఉంటారని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. గురువారం కొత్తగూడెం పట్టణంలోని హనుమాన్ బస్తీలో గల బ్యాడ్మింటన్ ఇండోర్ క్లబ్‌లో ప్రారంభమైన రాష్ట్ర స్థాయి 10వ షటిల్


నిర్వాహకులతో కలెక్టర్ జితేష్ వి పాటిల్

బ్యాడ్మింటన్ క్రీడ పోటీలను ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జాతీయ బ్యాడ్మింటన్ శిక్షకుడు, దివంగత గుజ్జుల సుధాకర్‌రెడ్డి మెమోరియల్ పేరిట వరుసగా ఈ పోటీలు నిర్వహిస్తున్నందుకు అసోసియేషన్ జిల్లా కార్యదర్శి డాక్టర్ సావిత్రిని ప్రత్యేకంగా అభినందించారు. ఈ టోర్నమెంట్ వేదికగా రాష్ట్ర స్థాయి క్రీడాకారులు వెలుగులోకి వస్తారని అన్నారు. బ్యాడ్మింటన్ క్రీడాకారుడిగా, శిక్షకుడిగా క్రీడాభివృద్ధికి సుధాకర్‌రెడ్డి చేసిన సేవలు చిరస్మరణీయమైనని కొనియాడారు. యువ ఆటగాళ్లను ప్రోత్సహించడం, క్రీడా సంస్కృతిని అభివృద్ధి చేయడం కోసం ఆయన చేసిన కృషి తరతరాలకు, నేటి యువతకు ప్రేరణగా నిలుస్తుందన్నారు. ఈ టోర్నమెంట్‌లో పాల్గొంటున్న 450 మంది క్రీడాకారులు విజయం కోసం పరితపించాలని, నిజమైన క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించాలన్నారు. క్రమ శిక్షణ, కఠిన శ్రమ, పట్టుదల విజయం సాధించడంలో ప్రధాన పాత్ర వహిస్తాయని సూచించారు. గెలుపోటములను సమానంగా తీసుకోవాలని, అన్నారు. అనంతరం రెండు నిమిషాల మౌనం పాటించారు. ఈ కార్యక్రమంలో డీవైఎస్‌వో పరంధామరెడ్డి, భద్రాద్రి బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు ఇంటూరి రవికుమార్, కోశాధికారి రమేష్, సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె.సాబీర్‌పాషా, టీపీసీసీ సభ్యుడు నాగా సీతారాములు, కొత్తగూడెం థర్మల్ పవర్ స్టేషన్ (5, 6 దశలు) చీఫ్ ఇంజనీర్ ఎం.ప్రభాకర్‌రావు, 7వ దశ చీఫ్ ఇంజనీర్ కె.శ్రీనివాస్ బాబు, ఒలింపిక్ అసోసియేషన్ ప్రెసిడెంట్ డాక్టర్ యుగంధర్‌రెడ్డి, కార్యదర్శి రాజేంద్రప్రసాద్, అసోసియేషన్ సభ్యులు రాజాకుమార్, శ్రీనివాస్, హసన్, హరిప్రసన్నకుమార్, వెంకటేశ్వర్లు, గిరి, యాకూబ్ పాషా, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కూనంనేని

పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, కోర్టు డ్యూటీ కానిస్టేబుళ్లను

సన్మానించిన సునిల్ దత్


సన్మానిస్తున్న సీపీ సునిల్ దత్

ఖమ్మంక్రైం ఫిబ్రవరి6(ఆంధ్రజ్యోతి): కీలకమైన రెండు వేర్వేరు హత్యకేసుల్లో నిందితులు చేసిన నేరాల నుంచి తప్పించుకోకుండా ప్రాసిక్యూషన్ తరుపున వాదించి నిందితులకు శిక్షపడేలా చేసిన పబ్లిక్ ప్రాసిక్యూటర్‌లు ఎ.శంకర్, బి.కృష్ణమోహన్‌లను ముదిగొండ, తిరుమలాయపాలెం పోలీసుస్టేషన్ల కోర్టు డ్యూటీ కానిస్టేబుళ్లు ఆదినారాయణ, భద్రాజీ, హోంగార్డు యూసుఫ్‌లను పోలీసుకమిషన్ సునిల్‌దత్ తన కార్యాలయంలో గురువారం ఘనంగా సన్మానించారు. ముదిగొండ మండలం బాణాపురం తండాలో గతంలో జరిగిన భార్య హత్యకేసులో సరైన ఆధారాలు కోర్టులో అందించి నిందితులకు శిక్షపడేలా చేశారు. అదేవిధంగా తిరుమలాయపాలెం మండలం చంద్రుతండాలో భూమి గొడవలు, పాతకక్షల నేపథ్యంలో మద్యంలో విషం కలిపి ముగ్గురిని హత్యచేసిన కేసులో పోలీసు సిబ్బంది సరైన ఆధారాలు సేకరించి కోర్టులో ప్రవేశపెట్టడంతో నిందితులకు జీవితఖైదు విధిస్తూ కోర్టు తీర్పు ఇచ్చింది. ఈనేపథ్యంలో పబ్లిక్ ప్రాసిక్యూటర్లను, కోర్టు డ్యూటీ కానిస్టేబుళ్లను సన్మానించినట్లు సీపీ తెలిపారు. భవిష్యత్తులో ఇలాంటి కేసుల నుంచి నిందితులు తప్పించుకోకుండా ఇదే స్ఫూర్తితో వ్యవహరించాలని కోరారు. కార్యక్రమంలో ట్రైనీ ఐపీఎస్ అధికారి రుత్విక్‌సాయి, రూరల్ ఏసీపీ తిరుపతిరెడ్డి, ముదిగొండ సీఐ మురళి, కూసుమంచి సీఐ సంజీవ్, ఎస్ఐ జగదీష్ పాల్గొన్నారు.

వయో వృద్ధులు, శారీరక దివ్యాంగులకు పరికరాలు

10 నుంచి 14 వరకూ నియోజకవర్గాల వారీగా పంపిణీకి సిద్ధం

ఖమ్మం ఖానాపురం హవేలీ,ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని వయోవృద్ధులు, శారీరక దివ్యాంగులకు ఆర్టీఫిషియల్ లింబ్ మ్యాన్‌ఫ్యాచరింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా సహకారంతో జిల్లాలోని ఐదు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో ఎంపిక శిబిరాలు నిర్వహించి వారికి అవసరమయ్యే పరికరాలను అందిచటం జరుగుతుందని జిల్లా మహిళా శిశు వయోవృద్ధుల, దివ్యాంగుల శాఖ అధికారి రాంగోపాల్‌రెడ్డి గురువారం తెలిపారు. వయో వృద్ధులకు చేతికర్రలు, వాకర్స్, వినికిడి యంత్రాలు, శారీరక దివ్యాంగులకు అవసరమైన చార్జింగ్ బ్యాటరీతో నడిచే ట్రై సైకిళ్ళు, , కాలిపర్స్, కృత్రిమ కాళ్లు అందించటం జరుగుతుందని తెలిపారు. ఖమ్మం అసెంబ్లీ నియోజకవర్గంలో ఫిబ్రవరి 10న, ఎన్ఎస్పీ క్యాంప్ రోడ్‌లోని రోటరీక్లబ్‌లో, 11న సత్తుపల్లి అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలోని ప్రభుత్వ బాలికల పాఠశాల సత్తుపల్లిలో, 12న మధిర అసెంబ్లీ నియోజకవర్గం పరిధదిలో రైతు వేదిక మధిర, 13న వైరా అసెంబ్లీ నియోజకవర్గ పరిధదిలో రైతు వేదిక వైర, 14న పాలేరు అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో రైతు వేదిక గురువైగుడెం రోడ్ కూసుమంచిలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అర్హత ఆసక్తి గత వృద్ధులు ఆదాయ ధృవీకరణ పత్రం, ఆధార్‌కార్డు, వయస్సు ధృవీకరణ పత్రం,పాస్‌పోర్ట్ సైజు ఫోటోతో హాజరుకాలని, శారీరక దివ్యాంగులు ఆదాయ ధృవీకరణ పత్రం, బీపీఎల్ రేషన్ కార్డు, ఆధార్ కార్డు వైకల్య ధృవీకరణ పత్రం తీసుకోని హాజరుకావాలని తెలిపారు.

బౌద్ధ స్థూపాన్ని సందర్శించిన శ్రీలంక బృందం

నేలకొండపల్లి, ఫిబ్రవరి6 (ఆంధ్రజ్యోతి): దక్షిణ భారతదేశంలోని అతి పెద్దదైన, ప్రాచీనమైన నేలకొండపల్లిలోని బౌద్ధ క్షేత్రాన్ని గురువారం శ్రీలంకకు చెందిన 14 మంది పర్యాటకుల బృందం సందర్శించింది. బుద్ధవనం కన్సల్టెంట్ డా.ఈమని శివనాగిరెడ్డి పర్యాటకులకు బౌద్ధ క్షేత్రం ప్రాముఖ్యతను వివరించారు. నేలకొండపల్లి బౌద్ధ స్థూపం దక్షిణ భారతదేశంలోనే అతి పెద్దదని, బౌద్ధ భిక్షువులకు కేంద్రంగా నిలిచిందని వివరించారు. నేలకొండపల్లి బౌద్ధస్థూపం బారతదేశంలోని బౌద్ధ క్షేత్రాల్లో అత్యంత చిరస్మరణీయమౌన ప్రదేశమన్నారు. ఇటువంటి ప్రాచీన క్షేత్రాలు పర్యాటక రంగం అభివృద్ధికి దోహదం చేస్తాయని శివనాగిరెడ్డి శ్రీలంక పర్యాటకులకు వివరించారు. శ్రీలంక పర్యాటకుల రాకతో నేలకొండపల్లి బౌద్ధ క్షేత్రం ప్రపంచ వ్యాప్తంగా ప్రాచుర్యం పొందే అవకాశం ఉందని శివనాగిరెడ్డి అన్నారు. అంతకు ముందు శ్రీలంక పర్యాటకులు బౌద్ధస్థూపం చుట్టూ తిరిగి అత్యంత ఆసక్తిగా తిలకించారు. స్థూపాన్ని తిలకించి, వారు పులకితులయ్యారు.


బౌద్ధ స్థూపం వద్ద శ్రీలంక పర్యాటకులు

రేపటినుంచి ఖమ్మంలో

మెగా ఆర్గానిక్ మేళా

ఖమ్మంవ్యవసాయం, ఫిబ్రవరి6 (ఆంధ్రజ్యోతి): ఈనెల 8, 9 తేదీలలో రెండురోజుల పాటు ఖమ్మంనగరంలోని ఇంటిగ్రేటెడ్‌కూరగాయల మార్కెట్ ఆవరణలో గ్రామభారతి, సంయుక్త కిసాన్‌మోర్చా ఆధ్వర్యంలో ఆర్గానిక్ మేళా నిర్వహిస్తున్నట్లు సంయుక్త కిసాన్‌మోర్చా జాతీయ కార్యవర్గసభ్యులు నల్లమల వెంకటేశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతినెలా రెండో శనివారం నుంచి ఆదివారం వరకు నిర్వహించే ఈమేళాను శనివారం రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రారంభిస్తారని తెలిపారు. ఈ మేళాలో సేంద్రియ పద్ధతిలో సాగుచేసిన కూరగాయలు, పండ్లు, చిరుధాన్యాలు, దంపుడుబియ్యం, దేశవాళీ ఆవునెయ్యి, గానుగ నూనెలు, వనమూలికల పొడులు, పసుపు, బెల్లం, తేనె, చేనేత వస్త్రాలు, జ్యూట్ బ్యాగులు అమ్మకానికి అందుబాటులో ఉంటాయని ఆయన ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు ఈ మేళాను సదందర్శించి, సద్వినియోగించుకోవాలని ఆయన కోరారు.

ట్రాక్టర్ కాలువలో పడి కౌలు రైతు దుర్మరణం

మృతుడు మాజీ సర్పంచ్ కుమారుడు

కొణిజర్ల, ఫిబ్రవరి6 (ఆంధ్రజ్యోతి): తనే స్వయంగా ట్రాక్టర్ నడుపుకుంటూ రాపల్లె మేజర్ కాల్వ కట్టపై వెళుతుండగా ప్రమాదవశాత్తూ కాల్వలో ట్రాక్టర్ పల్టీ కొట్టడంతో కౌలురైతు మృతి చెందిన సంఘటన గురువారం జరిగింది. స్థానికులు, ఎస్ఐ సూరజ్ తెలిపిన వివరాల ప్రకారం మండల పరిధిలోని పెద్దగోపతి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ తడికమళ్ల దానియేలు కుమారుడు తడికమళ్ల రవి(30) ఉదయం గ్రామానికి చెందిన ఓ రైతు ట్రాక్టర్ తీసుకొని తన పొలంలో నారుమడికినీళ్లు పెట్టుకోవడానికి జనరేటర్ అవసరం ఉండటంతో దాని కోసం సమీపంలోని ఓ రైతు పొలం వద్ద ఉన్న జనరేటర్ కోసం రాపల్లె మేజర్ కట్టపై ట్రాక్టర్‌తో మరో ఇద్దరు కళ్యాణ్, విజయ్‌తో కలిసి వెళ్లుతున్నాడు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తూ కట్టపై నుంచి కాల్వలోకి ట్రాక్టర్ పల్టీ కొట్టింది. ట్రక్కులో ఉన్న కళ్యాణ్, విజయ్‌లు బయటకు దూకి ప్రాణాలు కాపాడుకున్నారు. రవి ట్రాక్టర్ నడుపుతుండటంతో ఇంజన్‌తో సహా కాల్వలో పడి టైర్ల క్రింద రవి పడ్డాడు. స్థానికులు వచ్చి ఇంజన్‌ను తొలగించేటప్పుడకే రవి ప్రాణాలు కోల్పోయాడు. స్థానికులంతా మృతదేహాన్ని బయటకు తీశారు. పోలీస్‌లకు సమాచారం ఇవ్వడంతో ఎస్ఐ, సిబ్బందితో సంఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఖమ్మం తరలించారు. మృతుడి తండ్రి దానియేలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతుడికి భార్య రాధమ్మ, కుమారుడు, కుమార్తె ధనుష్, నిత్య ఉన్నారు. రవి తండ్రితో పాటు గ్రామంలో భూములను కౌలుకు తీసుకొని వ్యవసాయం చేస్తున్నాడు. ఈ క్రమంలోనే మూడెకరాలలో వరి వేసేందుకు ముందుగా నారుమడి తడపటానికి నీళ్ల అవసరం ఉండటంతో జనరేటర్ కోసం వెళ్లాడు. రవి మృతితో కుటుంబ సభ్యులంతా దు:ఖసాగరంలో మునిగారు. రవి మృతితో గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి.


మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

కేఎంసీలో ఫైల్స్ మాయాజాలం

- ఇంజనీరింగ్ అధికారుల ఫైల్స్ కాంట్రాక్టర్ల చేతిలోకి
- సీసీ కెమెరాలో తతంగం నమోదు
- అటెండర్ సస్పెన్షన్, హోల్డ్‌లో వర్క్‌ఇన్‌స్పెక్టర్
- ఫైల్ ఇంటికి తీసుకేళ్లిన కాంట్రాక్టర్‌కు నోటీసులు
- చర్యలు తీసుకున్న కమిషనర్ అభిషేక్ ఆగస్త్య

ఖమ్మం సంక్షేమ విభాగం, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగర పాలక సంస్థలోని ఇంజనీరింగ్ విభాగంలో ఎంతో కాలంగా జరుగుతున్న ఫైల్స్ మాయాజాలం తతంగం ఎట్టకేలకు నిఘా(సీసీ కెమెరాలు) నేత్రాలకు చిక్కింది. ఇంజనీరింగ్ అధికారుల బీరువాలో ఉన్న ఫైల్‌ను రహస్యంగా అటెండర్ కాంట్రాక్టర్ చేతికి అప్పగించింది. ఈ సంఘటన కేఎంసీలో వివాదంగా మారింది. దీంతో కమిషనర్ అభిషేక్ ఆగస్త్య విచారణ చేపట్టటంతో ఫైల్స్ మాయాజాలం బయట పడింది. ఖమ్మం నగర పాలక సంస్థలో మోతిలాల్‌నాయక్ కాంట్రాక్ట పనులు చేస్తుంటారు. అతనికి సంబంధించిన ఫైల్ మూడు రోజుల క్రితం కేఎంసీలోని డీబీ సెక్షన్‌లో కనిపించకుండా పోయింది. సదరు కాంట్రాక్టర్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. విచారణ చేపట్టిన కమిషనర్ అభిషేక్ సంబంధిత ఏఈ యాకూబ్‌ఆలీని పిలిపించి ఫైల్స్ విషయంపై ప్రశ్నించారు. తాను ఫైల్ తీసుకొని తన బీరువాలోనే ఉంచానని, ఫైల్ ఎవ్వరు తీసుకేళ్లారో తెలియదని చెప్పటంతో ఇంజనీరింగ్ విభాగంలోని సీసీ కెమెరాలలోని పుటేజ్‌ను కమిషనర్ పరిశీలించారు. దీంతో ఫైల్స్ మాయాజాలం తతంగం బయట పడింది. ఇంజనీరింగ్ డీబీ సెక్షన్‌లో అటెండర్‌గా పనిచేస్తున్న రాజేశ్వరి శనివారం ఉద్యోగులు ఎవ్వరు లేని సమయంలో ఏఈ యాకూబ్‌ఆలీ ఫైల్ బీరువా వద్దకు వెళ్లి ఓ ఫైల్ తీసుకొని, కవర్‌లో పెట్టి బయటకు తీసుకొచ్చి సమీపంలోనే ఉన్న హరిప్రసాద్ కాంట్రాక్టర్ చేతికి అందజేసింది. ఆ ఫైల్‌ను ఆ కాంట్రాక్టర్ రహస్యంగా ఇంటికి తీసుకెళ్లారు. అయితే కాంట్రాక్టర్ కోరిన అతని ఫైల్ కాకుండా మరో కాంట్రాక్టర్ మోతీలాల్ ఫైల్ అతని చేతిలోకి వెళ్లింది. కాంట్రాక్టర్ ఆ ఫైల్‌ను వర్క్‌ఇన్స్‌పెక్టర్ శ్రీకాంత్‌కు అందించి తనకు అనుకూలంగా మార్పులు చేర్పులు చేయాలని కోరినట్లు తెలిసింది. దీంతో మోతీలాల్ ఫైల్ ఇంజనీరింగ్ విభాగంలో కనిపించకుండా పోయింది. దీంతో విచారణ చేసిన కమిషనర్ అభిషేక్ ఆగస్త్య ఇంజనీరింగ్ డీబీ సెక్షన్‌లోని సీసీ కెమెరా పుటేజ్‌ను పరిశీలించారు. జరిగిన తతంగం బయటపడింది. దీంతో అటెం డర్ రాజేశ్వరిపై సస్పెన్షన్ వేటు వేశారు. వర్క్ ఇన్స్‌పెక్టర్ శ్రీకాంత్‌ను హోల్డ్‌లో ఉంచారు. రహస్యంగా ఫైల్స్ ఇంటికి తీసుకెళ్లిన కాంట్రాక్టర్‌కు నోటీసులు జారీ చేశారు. అయితే శుక్రవారం ఇంజనీరింగ్ విభాగాన్ని స్వయంగా కమిషనర్ అభిషేక్ ఆగస్త్య తనిఖీలు చేయగా, మరుసటి రోజే ఫైల్ మాయం కావటం చర్చనీయాంశంగా మారింది.

ప్రభుత్వాసుపత్రిలో మెరుగవనున్న ఆర్థో సేవలు

ఆసుపత్రికి చేరిన ఆర్థో మిషనరీ

పాల్వంచటౌన్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): పాల్వంచ ప్రభుత్వ ఆసుపత్రిలో ఆర్థోపెడిక్ సేవలు రింత మెరుగుపడనున్నాయి. గురువారం ఆసుపత్రికి ఆర్థోపెడిక్ పరికరాలు, మిషనరీలు చేరుకున్నాయి. ఎమ్మెల్యే నిధులు రూ.80లక్షలు వెచ్చించి ఆసుపత్రికి కావలసిన డిజిటల్ ఎక్స్‌రే- మిషన్, సీఆర్మ్, ఎనస్తీషియా ఎక్విప్‌మెంట్‌తో పాటు అత్యాధునిక ఫర్నీచర్‌ను సమకూర్చారు. దీంతో పేదలకు ఖరీదైన వైద్యాన్ని ఉచితంగా అందించడానికి అన్ని ఏర్పాట్లు చేసారు. గతంలో అత్యవసర వైద్య సేవలు లేకపోవడంతో ప్రమాదంలో గాయపడిన వారిని కొత్తగూడెం, వరంగల్ రిఫర్ చేసేవారు. కానీ గతంలో ఆసుపత్రిని సందర్శించిన సమయంలో స్థానిక ఎమ్మెల్యే కూనంనేని ఈ విషయాలను పరిగణలోకి తీసుకుని అత్యవసర వైద్య సేవలు పాల్వంచలోనే అందుబాటులోకి తీసుకురావాలని, అందుకు ఎంత ఖర్చు అయినా తాను తన ఫండ్ నుంచి వెచ్చించడానికి సిద్ధంగా ఉన్నానని తెలిపారు. ఈ క్రమంలోనే ఆసుపత్రిలో అత్యవసర వైద్య సేవలందించడానికి కావలసిన మిషనరీ, ఫర్నీచర్ తదితరాల ఇండెంట్ సిద్ధం చేసారు. దీంతో ఎమ్మెల్యే తాను ఇచ్చిన మాట ప్రకారం ఎమ్మెల్యే నిధుల నుంచి రూ. 80 లక్షలు వెచ్చించడంతో పాల్వంచ ఆసుపత్రికి కొత్త హంగులు వచ్చాయి. ఆసుపత్రికి అత్యవసరమైన డిజిటల్ ఎక్స్‌రే, సీఆర్మ్ వంటి మిషనరీ రావడంతో ఎమర్జన్సీ ఆపరేషన్లు అందుబాటులోకి వస్తాయని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాంప్రసాద్ అన్నారు.


డిజిటల్ ఎక్స్‌రే మిషన్‌ను సిద్ధం చేస్తున్న దృశ్యం

ఐటీడీఏలో 12న జాబ్‌మేళా

భద్రాచలం, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): భద్రాచలం ఐటీడీఏలో ఈ నెల 12న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు భద్రాచలం ఐటీడీఏ పీవో బి.రాహుల్ తెలిపారు. ఈ జాబ్‌మేళాలలో నేరుగా ఉపాధి కోసం మెడ్‌ప్లస్, నవత రోడ్డు ట్రాన్స్‌పోర్టు, శ్రీరామ్ లైప్ ఇన్సూరెన్సు కంపెనీలు, గిరిజన నిరుద్యోగ యువతకు ఐటీసీ ప్రథమం సంస్థ ద్వారా బ్యూటీఫిషియన్, అసిస్టెంట్ ఎలక్ట్రీషియన్ శిక్షనలను రెండు నెలలు ఉచితంగా వసతి భోజనం కల్పించి అందజేస్తామన్నారు. పదో తరగతి నుంచి బీటెక్, డిగ్రీ, పీజీ వరకు అర్హతలు కలిగిన వారు ఈ ఈ ఎంపికల ప్రక్రియలో పాల్గొనవచ్చని పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన వారు పూర్తి ధ్రువీకరణ పత్రాలతో 12న ఉదయం 9 గంటలకు ఐటీడీఏ భద్రాచలంలోని యూత్ ట్రైనింగ్ సెంటర్‌లో హాజరుకావాలని కోరారు.

ఆన్‌లైన్ ఫిర్యాదుకు కదిలిన కేఎంసీ

ఖమ్మం సంక్షేమ విభాగం, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): మరుగుదొడ్డి వ్యర్థాలను రహదారి పెకి వదిలినందుకు భారీ జరిమాన విధించారు ఖమ్మం నగర పాలక సంస్థ అధికారులు. 3వ డివిజన్ జయనగర్ కాలనీ 11వ వీధిలో మాచర్ల వెంకటేశ్వర్లు సొంత నివాసం ఏర్పాటు చేసుకున్నారు. అతని నివాసం నుంచి మరుగుదొడ్డి వ్యర్థాలు బయటకు వచ్చి వీధి వ్యాప్తంగా దుర్వాసన వ్యాపించింది. దీంతో స్థానికులు కేఎంసీ ఫిర్యాదుల క్యూఆర్ కోడ్‌తో పాటుగా ఫోన్ చేసి ఫిర్యాదు చేశారు. ఆన్‌లైన్‌లో ఫిర్యాదు నమోదు కావటంతో వెంటనే పారిశుధ్య పర్యవేక్షకులు సాంబయ్య ఆధ్వర్యంలో వెళ్లి ఇంటి యజమానికి రూ.10వేలు జరిమాన విధించారు.

క్రైం సమాచారం

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

కారేపల్లి ఫిబ్రవరి6: (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతిచెందిన సంఘటన మండల పరిధిలోని పేరుపల్లి-జమాలపల్లి మధ్యచోటుచేసుకుంది.పోలీసుల కథనం ప్రకారం ఇల్లెందు మండలం చల్లసముద్రం పంచాయతీలోని వేములవాడ గ్రామానికి చెందిన కల్తీవిజయ్(30)బుధవారం రాత్రి 11గంటల సమయంలో పేరుపల్లి-జమాలపల్లి మధ్యలో మూలమలుపు వద్ద అతని టీఎస్28-4634 నెంబరు గల మోటర్‌సైకిలుపై నుంచి జమాలపల్లి వైపు వెళుతుండగా దిచక్రవాహనం అదుపుతప్పి రోడ్డు వైపు ఉన్న పెన్సింగ్ గడ్డలకు తగిలా రోడ్డుపై పడి అక్కడికక్కడే మృతిచెందాడు.మృతుడువిజయ్‌కు బార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు.ఎస్ఐ రాజారాం సంఘటన స్థలానికి చేరుకుని దర్యప్తుచేపట్టారు.అనంతరం మృతదేహన్ని పోస్టుమార్టం కోసం ఇల్లెందు ఆసుపత్రికి తరలించారు.

చికిత్స పొందుతూ యువతి మృతి

అశ్వారావుపేట రూరల్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన యువతి చికిత్స పొందుతూ గురువారం మృతిచెందింది. ఏఎస్ఐ వెంకటేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని తిరుమలకుంటకు చెందిన సోయం శిరోమణి(19) ఇంట్లో పనులు చేయటంలేదంటూ తల్లి రత్తమ్మ మందలించింది. దీంతో మనస్థాపానికి గురైన యువతి గతనెల 15న గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. కుటుంబసభ్యులు అశ్వారావుపేటలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించి చికిత్స అందించారు. ఈనెల 1న శిరోమణి అనారోగ్యానికి గురికావటంతో ఖమ్మం ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. చికిత్స పొందుతున్న యువతి పరిస్థితి విషమించి మృతిచెందింది. ఘటనపై తల్లి ఫిర్యాదు చేయగా పోస్టుమార్టం నిర్వహించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ తెలిపారు.

గుండెపోటుతో అంగన్వాడీ టీచర్ మృతి

కల్లూరు, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): కల్లూరు మండల పరిధిలోని చిన్నకోరుకొండి సెక్టార్ పరిధిలో గల చెన్నూరు గ్రామానికి చెందిన అంగన్వాడి కేంద్రం-3 టీచర్ గజ్జల నాగమణి (62) గురువారం ఉదయం తిరువూరు ఆసుపత్రిలో వైద్య చికిత్స పొందుతూ గుండెపోటుతో మృతి చెందారు. గత 30 సంత్సరాలకు పైగా చెన్నూరులో అంగన్వాడి కేంద్రం ద్వారా చిన్నారులకు, తల్లులకు, గర్భిణీలకు, బాలింతలకు సేవలందించారు. గ్రామంలో అంగన్వాడి టీచర్‌గా నాగమణి మంచి గుర్తింపు పొందారు. మృతురాలికి భర్త చిన్నకోటేశ్వరరావుతో పాటుగా ఇద్దరు కుమారులు ఉన్నారు. ఈ మేరకు సమాచారం అందుకున్న కల్లూరు సీడీపీవో సీహెచ్ నిర్మల జ్యోతి, ఏసీడీపీవోలు మోహూరున్నీసాబేగం, రత్తమ్మ ఎస్వోలు వెంకటమ్మ, సుజాత, భవానీలతో పాటుగా సీసీటీయూ నాయకులు చలమల విఠల్, సీపీఎం నాయకులు మాదాల వెంటేశ్వరరావు, తన్నీరు కృష్ణార్జునరావు, అంగన్వాడి టీచర్ల సంఘం నాయకులు కోటేశ్వరి, నాగమణి, వాణిశ్రీ, జ్యోతి, రాజకుమారి, ప్రభావతితోపాటుగా మండల పరిధిలోని పలువురు అంగన్వాడి టీచర్లు తరలి వచ్చి మృతదేహంపై పూలమలలు వేసి ఘనమైన నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు సానుభూతి సంతాపం తెలిపారు.

కుర్నవల్లిలో వరిగడ్డి వామి దగ్ధం

తల్లాడ, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): తల్లాడ మండలం కుర్నవల్లి గ్రామంలో గురువారం వరిగడ్డి వామి దగ్ధమైంది. స్థానిక సొసైటీ వీధిలోని కర్నాటి దుర్గకు చెందిన నాలుగెకరాల్లోని వరిగడ్డి వామి వేశారు. గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు పెట్టడం వల్ల వరిగడ్డి వామి దగ్ధమైందని దుర్గ అనుమానం వ్యక్తం చేశారు. దగ్ధమైన వరిగడ్డి విలువ సుమారు రూ.40వేలు ఉంటుందని బాధితురాలు తెలిపింది.

దేవాలయ భూమిలో రోడ్లు వేసిన రైల్వే కాంట్రాక్టర్

మధిర రూరల్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): మధిర మండలం దెందుకూరు గ్రామసమీపంలోగల ఆ గ్రామ ఆంజనేయస్వామి దేవాలయానికి చెందిన పొలంలో ఎటువంటి అనుమతులు లేకుండా గుట్టుచప్పుడుగా రైల్వే కాంట్రాక్టర్, అధికారులు రోడ్ల నిర్మాణం చేపట్టారని వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ దేవాదాయశాఖ అధికారులు, ఆలయ పూజారి మధిర రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆలయ పూజారి మురళీ తెలిపిన ప్రకారం వివరాలిలా ఉన్నాయి. దెందుకూరు గ్రామంలో కోదండ రామ, ఆంజనేయస్వామి దేవాలయాలకు సర్వేనెంబర్ 625లో ఆరెకరాల 20కుంటల భూమి కలదు. ప్రస్తుతం ఈ పొలంలో సుబాబుల్ పంట వేసి ఉంది. ఈభూమిని రైల్వేవారు ఆక్రమించి అక్రమంగా సిమెంట్ రోడ్డు నిర్మించారు. దేవాదాయశాఖ నుంచి ఎటువంటి అనుమతి లేకుండానే రైల్వే కాంట్రాక్టర్ అక్రమ నిర్మాణాన్ని చేపట్టాడు. ఈ నిర్మాణం చేపట్టిన కాంట్రాక్టర్ దాని పర్యవేక్షణ చేసిన రైల్వే అధికారులపై చర్యలు తీసుకోవాలని దేవాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ అనిల్‌కుమార్‌తో కలిసి మధిర రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు పూజారి తెలిపారు. ఈ విషయంపై తహసీల్దార్‌కు వినతిపత్రాన్ని అందజేసినట్లు తెలిపారు.

అక్రమంగా తరలిస్తున్న పశువుల వ్యాన్ పట్టివేత

కల్లూరు, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): కల్లూరులో అక్రమంగా పశువులను తరలిస్తున్న వ్యాన్‌ను గురువారం యస్ఐ హరిత సిబ్బందితో కలిసి పట్టుకున్నారు. వివరాలిలా ఉన్నాయి. రాజమండ్రి నుంచి అశోక్ లేలాండ్ వాహనంలో నమ్మి మణికంఠస్వామి, అందే నాగేశ్వరావులు కలిసి 19 పశువులు (ఆవులు, ఎద్దులు) హైదరాబాద్‌కు తరలిస్తున్నారని సమాచారం అందగా హైవే రహదారిపై అడ్డగించి వాహనాన్ని పట్టుకున్నారు. వాహనంను సీజ్ చేసి పశువులను పాల్వంచ గోశాలకి తరలించడం జరిగింది, స్థానిక యస్ఐ హరిత నిందితులపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

స్వాతంత్ర్య సమర యోధురాలి మృతి

తల్లాడ, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): తల్లాడ మండలం నారాయణపురం గ్రామంలో గురువారం స్వాతంత్ర్య సమరయోధురాలు వేమిరెడ్డి నాగమ్మ(96)అనారోగ్యంతో మృతిచెందారు. నాగమ్మకు ముగ్గురు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. నాగమ్మ మృతికి పలువురు సంతాపం తెలిపారు.

ప్రియుడి ఇంటి ముందు ప్రియురాలి ధర్నా

పెనుబల్లి, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): ప్రియుడి ఇంటి ముందు ఓ ప్రియురాలు ధర్నాకు దిగిన ఈ సంఘటన గురువారం మండలంలోని మండాలపాడులో చోటుచేసుకుంది. బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన గోపిచంద్ తాను గత ఏడు సంవత్సరాలుగా ప్రేమించుకుంటున్నామని తెలిపింది. కొంతకాలం క్రితం ఇదే యువతికి వివాహమైంది. అయినప్పటికీ తన భర్తతో విడాకులు తీసుకొని తన వద్దకు రావాలని ప్రియుడు గోపిచంద్ వేధింపులకు గురిచేసేవాడని, ఈ క్రమంలోనే తనతో దిగిన ఫొటోలను భర్తకు పంపించాడు. దీంతో తన భర్తతో గొడవలు జరిగి విడాకులు తీసుకున్నానని పేర్కొంది. తనకు తాళి కూడా కట్టాడని యువతి ఆరోపిస్తుంది. గురువారం అతడి ఇంటిముందు ధర్నాకు దిరిగింది.



బీసీల అభ్యున్నతే కాంగ్రెస్ పార్టీ లక్ష్యం

కామేపల్లి,ఫిబ్రవరి7(ఆంధ్రజ్యోతి):బీసీఅభ్యున్నతే కాంగ్రెస్ పార్టీ లక్ష్యమని మండల కాంగ్రెస్ బీసీ సెల్ అధ్యక్షుడు చల్లా మల్లయ్య అన్నారు. గురువారం మండల పరిధిలోని కొత్తలింగాల క్రాస్ రోడ్‌లో సీఎం రేవంత్‌రెడ్డికి, జిల్లా మంత్రులకు, ఎమ్మెల్యే కోరం కనకయ్య చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. గత ప్రభుత్వ పాలకులు బీసీ ఓటర్లను అవసరానికి వాడుకున్నారు.. తప్ప బీసీలకు ఎలాంటి సామాజిక న్యాయం చేయలేదన్నారు. అనంతరం ఎస్సీ సెల్ అధ్యక్షుడు కవిరాజ్ ఆధ్వరంలో కూడా క్షీరాభిషేకం చేశారు. ఈకార్యక్రమంలో మండల అధ్యక్షుడు నర్సింహరెడ్డి, డీఎస్, నల్ల మోతు లక్ష్మయ్య, ధనియాకుల హన్మంతరావు, పీ.వీరభద్రం, మద్దినేని రమేష్, జీ. రాంబాబు, దొడ్డ వేణు, మాలోత్ ప్రేమ్, మాలోత్ బావ్‌సింగ్, బొడ్డు లక్ష్మినారాయణ, అనురాధ ఉన్నారు.

రైతుబజార్ కూరగాయల ధరలు

(కిలో ఒక్కంటికి రూపాయల్లో)

టమాటా	16 రూ.
వంకాయ	28
గుత్తి వంకాయ	36
బీరకాయ	48
పచ్చిమిర్చి	24
బెండకాయ	48
బెండకాయ	54
పొట్లకాయ	28
దోసకాయ	34-40
చిక్కుడు	40
నాటుచిక్కుడు	80
గోరుచిక్కుడు	54
క్యాబేజీ	20
దొండ	34-40
సొరకాయ	18
క్యారెట్	35
క్యాప్సికం	54
ఆలుగడ్డ	30
ఉల్లిగడ్డ	35-40
కోడిగుడ్ల ట్రే (30 గుడ్లు)	150
కొత్తిమీర కట్ట	20

- ఆంధ్రజ్యోతి, ఖమ్మం మార్కెట్

రోడ్లపై భవన నిర్మాణ సామగ్రి తొలగించాలి

- ప్రజలకు ఇబ్బంది కలిగించే వారిపై చర్యలు తీసుకోవాలి
- కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్
- మునిసిపల్ అధికారులకు ఆదేశం





ఈవీఎం గోదాములో సంతకం చేస్తున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, విద్యార్థులను అభినందిస్తున్న కలెక్టర్

ఖమ్మంకలెక్టరేట్, ఫిబ్రవరి6(ఆంధ్రజ్యోతి): రోడ్లపైనా.. రోడ్లకు అడ్డంగా భవన నిర్మాణ సామగ్రి ఉంచి ప్రజలకు ఇబ్బందులు కలిగించే వారిపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ మునిసిపల్ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. గురువారం ఆయన తన క్యాంపు కార్యాలయం నుంచి వైరారోడ్డు మీదుగా జిల్లా ఆస్పత్రికి వెళ్తుండగా మార్గమధ్యలో వైరారోడ్‌లో భవన నిర్మాణాలు జరిగే చోట, రోడ్లపై ఇసుక తదితర నిర్మాణ వస్తువులు వేయడాన్ని గమనించారు. కలెక్టర్ స్పందించారు. అక్కడ ఆగి ఆయన ఆరా తీశారు. ఇలా రోడ్లపై భవన నిర్మాణ వస్తువులు, భవన వ్యర్థాలు రోడ్లపై వేయడంతో ప్రజలకు అసౌకర్యంతో పాటు, ప్రమాదాలకు ఆస్కారం ఉందని కలెక్టర్ అన్నారు. వీటిపై మునిసిపల్ అధికారులు జరిమానా విధించడంతో పాటు, చట్టరిత్యా చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

ఖమ్మం కలెక్టరేట్ ఉత్తమ గార్డెనింగ్ అవార్డు

రాష్ట్ర ఉద్యానశాఖ ఈనెల 4న నిర్వహించిన గార్డెనింగ్ ఫెస్టివల్‌లో జిల్లా కలెక్టరేట్ ఉత్తమ గార్డెనింగ్ అవార్డ్‌ను అందుకుంది. రెండు నెలల్లో కలెక్టరేట్‌లో గార్డెనింగ్ చేపట్టి అభివృద్ధి చేశారు. ఈ సందర్భంగా అవార్డును కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ జిల్లా ఉద్యానవ అధికారి ఎంవీ మధుసూదన్‌కు గురువారం కలెక్టరేట్ అందజేశారు. ఈ సందర్భంగా సెరికల్చర్ డీడీ ముత్యాలరావు, ఉద్యాన సాంకేతిక అధికారి వి.అనితశ్రీ, ఉద్యాన అధికారి సి.అపర్ణ, సిబ్బంది హసీనా తదితరులను కలెక్టర్ అభినందించారు.

ఈవీఎం గోడౌన్ తనిఖీ

నెలవారీ తనిఖీల్లో భాగంగా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ కలెక్టరేట్ లోని ఈవీఎం గోడౌన్‌ను గురువారం తనిఖీ చేశారు. గ్రౌండ్‌ఫ్లోర్‌లో బ్యాలెట్, కంట్రోల్ యూనిట్‌లు భద్రపరిచిన గది, మొదటి అంతస్తులో భద్రపరిచిన వీవీ ప్యాట్‌గది సీల్‌లను, గోడౌన్ వద్ద బందోబస్తును పరిశీలించారు. నిత్యం అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. అనంతరం తనిఖీ రిజిస్టర్ లో జిల్లా కలెక్టర్ సంతకం చేశారు. ఆయన వెంట ఎన్నికల విభాగం పర్యవేక్షకులు స్వామి, కలెక్టరేట్ ఎన్నికల డీటీ అన్సారీ తదితరులున్నారు.

సీఎం కప్ ఫుట్‌బాల్ పోటీ విజేతలను అభినందించిన కలెక్టర్

క్రీడల్లో అద్భుత ప్రదర్శన కనబరుస్తున్న ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థినులను జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ప్రత్యేకంగా అభినందించారు. గురువారం కలెక్టరేట్‌లో సీఎం కప్ ఫుట్ బాల్ పోటీలలో విజేతలైన వీవీపాలెం ప్రభుత్వ పాఠశాల విద్యార్థినులు కలెక్టర్‌ను కలిశారు.ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థినులు సీఎంకప్ ఫుట్‌బాల్ పోటీలో విజయం సాధించడం, ఖేలోఇండియా స్థాయిలో అండర్ 13,15,17 గ్రూప్‌లలో రన్నర్స్‌గా నిలవడం చాలా సంతోషం అన్నారు. ప్రభుత్వపాఠశాలల్లో చదివే విద్యార్థినులు రాష్ట్ర,జాతీయస్థాయి పోటీల్లో పాల్గొని విజయం సాధించేలా తీర్చిదిద్దిన టీమ్ కోచ్ మాధురికి ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కోచ్ ఆదర్శ కుమార్, విద్యార్థినిలు పాల్గొన్నారు.

రేషన్ దుకాణాన్ని సద్వినియోగం చేసుకోవాలి

తహసీల్దార్ రాంప్రసాద్

ఖమ్మంరూరల్, ఫిబ్రవరి6(ఆంధ్రజ్యోతి): ఏదులాపురం మున్సిపాలిటి పరిధిలోని వరంగల్ క్రాస్ రోడ్డులోని లెప్రసి కాలనీలో ఏర్పాటు చేసిన రేషన్ దుకాణాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని రూరల్ తహసీల్దార్ పిల్లి. రాంప్రసాద్ తెలిపారు. మున్సిపాలిటి పరిదిలోని లెప్రసి కాలనీలో గురువారం నూతనంగా ఏర్పాటు చేసిన రేషన్ దుకాణాన్ని తహసీల్దార్ రాంప్రసాద్, కమిషనర్ అహ్మద్ షఫీఉల్లా, ఎంపీడీఓ కుమార్ ప్రారంభించారు. ప్రతీ నెలా కాలనీ వాసులకు ఇబ్బందులు లేకుండా కాలనీలోనే రేషన్ దుకాణం ఏర్పాటు చేయాలని కలెక్టర్‌ఆదేశాలమేరకు ఏర్పాటు చేశామని చెప్పారు. ప్రతీ నెలా కాలనీలోనే ప్రజలు రేషన్ తీసుకోవచ్చునన్నారు.

విద్యా, వైద్య రంగాలను పట్టించుకోని కేంద్రం

బోనకల్,ఫిబ్రవరి6(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వరంగ సంస్థలను నిర్వీర్యం చేసేలా కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌ను రూపొందించిందని సీపీఎం జిల్లా కార్యద ర్శి నున్నా నాగేశ్వరరావు ఆరోపించారు. సీపీఎం కార్యాలయంలో గురువారం జరిగిన ఆ పార్టీ మండల సమావేశంలో మాట్లాడుతూ విద్యవైద్య రంగాలకు నిధుల కేటాయింపు సక్రమంగా లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

సినిమా

CINEMA

నగరంలో చిత్రాలు..

వినోద:	తండేల్
శ్రీనివాస:	డాకూ మహరాజ్
సాయిరాం:	పట్టుదల
కేపీఎస్:	ఒక పథకం ప్రకారం
తిరుమల:	సంక్రాంతికి వస్తున్నాం
సినీగెలాక్సీ:	డియర్ కృష్ణా

కేఎంసీ ఉద్యోగుల విధుల్లో మార్పు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ఖమ్మంసంక్షేమవిభాగం,ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగర పాలక సంస్థలో ఉద్యోగుల నిర్లక్ష్యంపై కమిషనర్ అభిషేక్ అగస్త్య చర్యలు తీసుకున్నారు. టైంపాస్‌తో పని చేస్తున్న వారికి చేతి నిండా పని కల్పించారు. సెల్‌ఫోన్‌లో సోషల్ మీడియాతో విధుల సమయాన్ని దుర్వినియోగం చేసిన ఉద్యోగులను వీధుల వెంట రెవెన్యూ వసూళ్లకు కేటాయించారు. ఫిబ్రవరి 4న ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన 'అడుగు బయట పెట్టరేం' కథనంపై కమిషనర్ అభిషేక్ ఆగస్త్య గురువారం స్పందించారు. కేఎంసీలోని రెవెన్యూ విభాగంలో విధులు నిర్వహిస్తున్న అవుట్ సోర్సింగ్ ఉద్యోగిని హనుమంతును పారిశుధ్యానికి కేటాయించారు. నూతనంగా ఉద్యోగంలో చేరిన వార్డు ఆఫీసర్ నాగరాజును పనితీరు మార్చుకోవాలని కమిషనర్ హెచ్చరించారు. మరో వార్డు ఆఫీసర్ పల్లవికి షోకాజ్ నోటీసులు జారీ చేశారు.

కాంగ్రెస్ ద్వారానే అన్నివర్గాలకు మేలు

తిరుమలాయపాలెం, ఫిబ్రవరి6(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ద్వారానే అన్నివర్గాలకు మేలు జరుగుతుందని తాళ్లచెరువు మాజీ సర్పంచ్ మండల కాంగ్రెస్ నాయకులు సంద్ర వెంకన్న అన్నారు. గురువారం మండలంలోని తిమ్మక్కపేటలో పార్టీకార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో అన్నివర్గాల ప్రజలకు తీవ్ర నష్టం జరిగిందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక దేశంలో ఎక్కడా లేని పథకాలను ప్రవేశపెట్టి పేదలకు మేలు జరిగే కార్యక్రమాలు చేపడుతుందన్నారు. ఆరుగ్యారంటీ పథకాలు అందరికి ఎంతో ఉపయోగంగా ఉన్నాయన్నారు. ఈ సమావేశంలో చుంచు రాములు, వెంకన్న, నాగేశ్వరరావు, వెంకట్ పాల్గొన్నారు.

తీర్థాల జాతరకు.. అధికారులు సమన్వయంతో పనిచేయాలి

- ఇబ్బందులు రాకుండా ఏర్పాట్లు చేయాలి
- రద్దీ నేపథ్యలో వీవీఐపీ, వీఐపీ పాస్‌లు రద్దు చేయాలి
- అధికారుల సమీక్షలో ఆర్డీవో నరసింహరావు



మాట్లాడుతున్న ఆర్డీవో నరసింహరావు

ఖమ్మంరూరల్, ఫిబ్రవరి6(ఆంధ్రజ్యోతి): ఈ నెల 26నుంచి ఐదు రోజులపాటు జరిగే తీర్థాల సంఘమేశ్వరస్వామి జాతరకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని ఆర్డీవో నరసింహరావు సూచించారు. మండల పరిధిలోని తీర్థాల సంఘమేశ్వరాలయంలో గురువారం జాతర ఏర్పాట్లపై అన్ని శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. జాతరకు వచ్చే లక్షలాది భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు ఏర్పాట్లు చేయాలన్నారు. పార్కింగ్ ఏరియాలో తాగు నీరు ఏర్పాటుచేయాలన్నారు. ఆలయప్రాంతంలోని రోడ్లు వరదలకు కొట్టుకుపోయినందున వాటికి మరమ్మతులు చేయాలన్నారు. మహిళలు దుస్తులు మార్చుకునేందుకు ప్రత్యేక గదులు, మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలన్నారు. గోళ్లపాడు, తీర్థాల రోడ్డు వరదలకు కొట్టుకుపోయినందున వాటికి వెంటనే మరమ్మతులు చేయాలని ఆర్‌అండ్‌బీ అధికారులను ఆదేశించారు.శానిటేషన్‌కు సంబంధించి పంచాయతి అధికారులు ఎక్కువమంది సిబ్బందిని ఏర్పాటు చేయాలన్నారు. భక్తులు పుణ్యస్నానాలు చేసేందుకు మున్నేరులోకి చెక్ డ్యాం నుంచి మోటర్లతో నీరు కిందకు వదిలేలా చూసుకోవాలని నీటిపారుదల శాఖాధికారులకు సూచించారు. భక్తుల సౌకర్యార్థం ఎక్కువ బస్సులను కేటాయించాలని ఆర్టీసీ అధికారులకు సూచించారు. స్వామివారి కల్యాణ మండపం కూలిపోయినందున దానికి వెంటనే మరమ్మతులు చేయించాలని ఆలయ అధికారులను ఆదేశించారు. వీవీఐపీ, వీఐపీ పాస్‌లతో ఇబ్బందులు ఎదురవుతున్నందున వాటిని రద్దు చేయాలన్నారు. ఐదు రోజులపాటు జరిగే జాతరకు అన్నిశాఖల అధికారులు పనులను ఈనెల20వరకు పూర్తి చేయాలని ఆర్డీవో ఆదేశించారు. ఈ సమావేశంలో తహసీల్దార్ రాంప్రసాద్, సీఐ రాజు, ఆలయ ఈవో ప్రసాద్ పాల్గొన్నారు.

డివిజన్ కార్పొరేటర్ సెల్‌నెంబర్

డివిజన్	కార్పొరేటర్	సెల్‌నెంబర్
1	తేజావత్ హుస్సేన్	98485 29188
2	మలీదు వెంకటేశ్వర్లు	99497 01116
3	మలీదు జగన్	....
4	దండా జ్యోతిరెడ్డి	98669 25591
5	పల్లెబోయిన భారతి	95538 53111
6	నాగండ్ల కోటేశ్వరరావు	90630 12222
7	దొంగల సత్యనారాయణ	81065 01875
8	లకావత్ సైదులునాయక్	98483 81719
9	షేక్ జాన్‌బీ	77996 85786
10	చావా మాధురి	80968 64444
11	సరిపూడి రమాదేవి	99482 78404
12	చిరుమామిళ్ల లక్ష్మీ	98493 29742
13	కొత్తపల్లి నీరజ	98483 16224
14	కూరాకుల వలరాజు	99498 97577
15	రావూరి కరుణ	92466 63945
16	మేడారపు వెంకటేశ్వర్లు	99126 44608
17	దనాల రాధా	95504 04444
18	మందడపు లక్ష్మీ	98480 18571
19	సీహెచ్ వెంకటనారాయణ	98485 88233
20	వీ ప్రశాంతలక్ష్మీ	98856 92345
21	ఆళ్ల నిరీశ	99487 14489
22	పల్లా రోశిలీనా	76599 87283
23	షేక్ మక్బూల్	98482 38953
24	కమర్తపు మురళీ	98859 74455
25	గోళ్ల చంద్రకళ	99495 29273
26	పునుకొల్లు నీరజ	94901 45220
27	దోడ్డా నాగేశ్వరరావు	88970 28299
28	గజ్జెల లక్ష్మీ	97019 23269
29	కొప్పెర సరిత	98489 41843
30	ముక్కల కమల	98483 04794
31	యర్రా గోపీ	77020 00447
32	డోనవాన్ సరస్వతి	96764 86370
33	తోటా ఉమారాణి	99511 25339
34	రుద్రగాని శ్రీదేవి	98496 34889
35	యల్లంపల్లి వెంకట్రావు	83282 18768
36	పసుమర్తి రామోహ్మన్‌రావు	98487 76665
37	షేక్ ఫాతిమాజోహారా	92465 55786
38	ఆలియా	98482 12872
39	మాధురి ప్రసాద్	98485 32871
40	దాడే అమృతమ్మ	96666 74646
41	కర్నాటి కృష్ణమూర్తి	99082 90555
42	పాకాలపాటి విజయనిర్మల	85001 65089
43	క్లైమెట్	98484 12449
44	పాలేపు విజయ	98669 25900
45	బుడిగెం శ్రీనివాస్	93993 70776
46	కర్నం వైష్ణవి	99668 66937
47	మాట్టేటి అరుణ	94403 58041
48	తోట గోవిందమ్మ	98480 15948
49	దుద్దుకూరి వెంకటేశ్వర్లు	98484 20471
50	రాపర్తి శరత్‌కుమార్	94940 43399
51	శీలంశెట్టి రమా	99492 28833
52	బుర్రి వెంకటేశ్వర్లు	99895 70941
53	పగడాల శ్రీవిద్య	94400 05558
54	మిక్కిలినేని మంజు	93969 66478
55	మోతారపు శ్రావణి	82975 49999
56	పగిడిపల్లి రోహిణి	98485 89580
57	మహ్మద్ రఫీదాబేగం	94901 88786
58	దోరేపల్లి శ్వేత	99639 07909
59	బట్టపోతుల లలితారాణి	81878 71700
60	బడ్డే నిరంజన్‌కుమార్	99667 72453

స్థానిక ఎన్నికలకు సిద్ధం కావాలి

- బీజేపీ నేలకొండపల్లి మండల అధ్యక్షుడు పాగర్తి

నేలకొండపల్లి, ఫిబ్రవరి6(ఆంధ్రజ్యోతి): త్వరలో జరుగనున్న స్థానిక సంస్థల ఎన్నికలకు కార్యకర్తలను సిద్ధం చేయాలని బీజేపీ మండలధ్యక్షుడు పాగర్తి సుధాకర్ బూత్ అధ్యక్షులను కోరారు. గురువారం చెర్వుమాధారంలో జరిగిన బూత్అధ్యక్షుల సమావేశంలో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ పథకాలతో పాటుగా కేంద్రం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు. ఆచరణ సాధ్యం కానీ హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రజలను మోసం చేస్తోందన్నారు. స్థానిక ఎన్నికల్లో సత్తా చాటాలని, ఇప్పటి నుంచే ప్రజల సమస్యలను తెలుసుకుంటూ, పరిష్కరించటానికి కార్యకర్తలు కృషి చేసేలా బూత్ అధ్యక్షులు ప్రయత్నం చేయాలని సుధాకర్ కోరారు. ఈ సమావేశంలో జ్ఞానరత్నం, మొహినుద్దీన్, నాగాచారి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

స్వార్థ రాజకీయాలు మానుకోవాలి

- యాదవ మహాసభ జిల్లా గౌరవాధ్యక్షుడు మేకల



మాట్లాడుతున్న మల్లిబాబు యాదవ్

కూసుమంచి,ఫిబ్రవరి6(ఆంధ్రజ్యోతి): వ్యక్తిగత స్వలాభం కోసం యాదవులను అడ్డుపెట్టుకుని రాజకీయాలు చేస్తున్నారని, ఇది మానుకోవాలని యాదవ మహాసభ జిల్లా గౌరవాధ్యక్షుడు మేకల మల్లిబాబుయాదవ్ హితవు పలికారు. గురువారం పాలేరు నియోజకవర్గస్థాయి సమావేశం కూసుమంచిలో జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం గొర్రెలకోసం కాపరులనుంచి డీడీలు కట్టించుకుని ఇవ్వకుండా మోసం చేసిందని ధ్వజమెత్తారు. అవినీతి అధికారులను అడ్డుపెట్టుకుని బీఆర్‌ఎస్ ప్రభుత్వమే మోసం చేయించిందని ఆరోపించారు. అప్పుడు అడగలేని పెద్దలు కొందరు నేడు ప్రశ్నిస్తున్నారని ఆరోపించారు. యాదవులకు సముచిత స్థానం కల్పించాలని, ఎన్నికల్లో ప్రాధాన్యత ఇవ్వాలని డిమాండ్ మల్లిబాబుయాదవ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు చిలకల వెంకటనర్సయ్య, జిల్లా యువజన అధ్యక్షుడు సింహాద్రి, సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు సైదులు, నాగసీతారాములు, వీరభద్రం తదితరులు పాల్గొన్నారు.

మండల యూత్‌అధ్యక్షుడిగా వెంకటరమణ

యాదవ మహాసభ మండల యూత్ అధ్యక్షుడిగా కూసుమంచికి చెందిన చెన్ను వెంకటరమణ నియమితులయ్యారు. కూసుమంచిలో నిర్వహించిన నియోజకవర్గస్థాయి సమావేశంలో జిల్లా గౌరవాధ్యక్షుడు మల్లిబాబు నియామకపు పత్రాన్ని అందించారు. ఈసందర్భంగా యాదవును సంఘటితం చేస్తూ సమస్యల పరిష్కారం కోసం కృషిచేస్తానని తెలిపారు.

ఆరెంపులలో బీఆర్‌ఎస్ ఖాళీ



పార్టీ కండువాలు కప్పుతున్న మంత్రి పొంగులేటి

ఖమ్మంరూరల్, ఫిబ్రవరి6(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎన్నికలు సమీపిస్తున్న వేళ బీఆర్‌ఎస్ పార్టీకి రూరల్ మండలంలో గట్టిషాక్ తగిలింది. మండలంలోని ఆరెంపుల గ్రామానికి చెందిన మాజీ సర్పంచులు సంఘం అధ్యక్షుడు బండి జగదీశ్ ఆధ్వర్యంలో గ్రామంలో బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన నాయకులు కాంగ్రెస్‌లలో చేరారు. రూరల్ మండల కో-ఆప్షన్ సభ్యుడు షేక్ దావూద్, మాజీ ఎస్ఎమ్‌సీ కమిటీ ఛైర్మన్ పప్పుల వెంకటరమణ, షేక్ యాకుబ్‌పాష, హైమత్, కరీం, ఫనీ, దాదాసాహెబ్, మధు, అజహర్, మౌలాలీ, సుభానిలతో పాటు 50కుటుంబాలు గురువారం హైదరాబాద్‌లోని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సమక్షంలో పార్టీలో చేరారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ పార్టీలో చేరిన ప్రతీ కార్యకర్తల కష్టసుఖాల్లో పాలుపంచుకోవటంతో పాటు వారి రాజకీయ భవిష్యత్తును తీర్చిదిద్దుతామని తెలిపారు. స్థానిక ఎన్నికల్లో ప్రతీ కార్యకర్త కష్టపడి పనిచేసి పార్టీ అభ్యర్థుల గెలుపుకోసం కృషిచేయాలని సూచించారు. అవకాశం ఉన్నచోట ఏకగ్రీవం సైతం చేయాలని ఆయన సూచించారు.

పంటలకు గిట్టుబాటు ధర ఇవ్వాలి



తెట్టెలపాడులో మిర్చి కల్లాలను పరిశీలిస్తున్న మాస్‌లైన్ బృందం సభ్యులు

తిరుమలాయపాలెం, ఫిబ్రవరి6(ఆంధ్రజ్యోతి):పంటలకు మద్దతు ధర కలిపించాలని సీపీఐఎంఎల్ మాస్‌లైన్ నాయకులు బందెల వెంకయ్య, కమ్మకోమటి నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. గురువారం మండలంలోని పిండిప్రోలు, తెట్టెలపాడు గ్రామాల్లోని మిర్చి కల్లాలను పార్టీ బృందం సభ్యులు పరిశీలించారు. రైతులు ఎంతో కష్టపడిపండించి అప్పులు తెచ్చి పంటలు సాగుచేస్తే కనీస మద్దతు ధరలేక రైతులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని, మిర్చికి క్వింటాకు రూ.25 వేలు మద్దతు ధర ఇవ్వాలన్నారు. పత్తికి రూ.10వేలు మద్దతుధర ఇవ్వాలన్నారు రైతుల కష్టాన్ని కార్పొరేట్ శక్తులు దళారీలు కొల్లగొడుతున్నారన్నారు. అయినా పాలకులు వారిపై చర్యలు తీసుకోవడంలేదన్నారు. ఈకార్యక్రమంలో తిమ్మడి హనుమంతరావు, ఎస్.వెంకటేశ్వర్లు, గొడుగు విజయ్, పుసులూరి గిరిబాబు, తుపాకుల నాగేశ్వరరావు, నరేందర్, వెంకటయ్య, నరసయ్య పాల్గొన్నారు.

ట్రై సైకిళ్ల కోసం శిబిరాల నిర్వహణ

బోనకల్, ఫిబ్రవరి 6: తెలంగాణ రాష్ట్ర దివ్యాంగుల సహకార సంస్థ సహకారంతో వయోవృద్ధులు, దివ్యాంగుల కోసం పంపిణీ చేసే కృతిమ అవయవాలు, ట్రై సైకిళ్ల కోసం ఎంపిక చేసే లబ్ధిదారుల కోసం ఈ నెల 12వ తేదీన మధిరలోని రైతు వేదికలో నియోజకవర్గ వ్యాప్తంగా అర్హులైన వారు శిబిరానికి హాజరు కావాలని ఎంపీడీవో ఆర్. రమాదేవి కోరారు.

మాకెంత!

- భవన వ్యర్థాలపై అధికారుల నామమాత్ర జరిమానా
- వాటిని తొలగించేందుకు కేఎంసీ జవాన్ల లాలూచీ
- పారిశుధ్య కార్మికులతో పనులు చేయిస్తూ డబ్బులు వసూలు



కమాన్ బజార్‌లో వ్యర్థాలు తొలగిస్తున్న కార్మికులు

ఖమ్మంసంక్షేమవిభాగం, ఫిబ్రవరి6 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగర పాలక సంస్థలోని కమర్షియల్ ప్రాంతాల జవాన్లుపై కాస్తా కమర్షియల్ జవాన్లుగా మారిపోతున్నారని విమర్శలు వెలువడుతున్నాయి. ప్రధాన రహదారుల వెంట కమర్షియల్ వ్యాపారాల కోసం బహుళ అంతస్తులు నిర్మాణాలు జరుగుతున్నాయి. ఈక్రమంలో భవన నిర్మాణాల వ్యర్థాలు డ్రైనేజీలో పడి మూసుకుపోతున్నాయి. ఆ వ్యర్థాలను భవన యజమానులతోనే తీయించాల్సి ఉంటుంది. కానీ వ్యాపారులతో జవాన్లు లోపాయికారిగా ఒప్పందాలు చేసుకొని నామమాత్రపు రూ.2వేల జరిమానా మాత్రమే విధిస్తున్నారు. పైగా కొందరు పారిశుధ్య కార్మికులను అక్కడకు తీసుకెళ్లి భవనాల వ్యర్థాలను తొలగిస్తున్నారు. భవనాల వ్యర్థాల పనులు తమతో చేయించటం ఎంత వరకు సమంజసమని పారిశుధ్య కార్మికులు వాపోతున్నారు. ఒక వైపు కేఎంసీలో పారిశుధ్య కార్మికుల కొరత వెంటాడుతోంది. భవనాల యజమానులే సొంత డబ్బులతో డ్రైనేజీలు శుభ్రం చేయించేలా కమిషనర్ అభిషేక్ అగస్త్య చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

పంటల డిజిటల్ సర్వేను త్వరగా పూర్తి చేయాలి

- డీఏవో ధనసరి పుల్లయ్య



సర్వేను పరిశీలిస్తున్న డీఏవో

కొణిజర్ల, ఫిబ్రవరి6(ఆంధ్రజ్యోతి): పంటల డిజిటల్ సర్వేను త్వరగా పూర్తి చే యాలని, డిజిటల్ క్రాప్ బుకింగ్ పారదర్శకంగా ఉండాలని, ఏ ఒక్కరైతు సర్వేనెం బరు మిస్‌కావద్దని డీఏవో ధనసరి పుల్లయ్య అధికారులను సూచించారు. గురువారం మండల పరిధిలోని చిన్నగోపతిలో జరుగుతున్న డిజిటల్ క్రాప్ బుకింగ్‌ను ఆయన పరిశీలించారు. ఏఈవో శ్రీనివాసరాజును క్రాప్‌బుకింగ్ వివరాలను అడిగితెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో ఉన్న అన్ని క్లస్టర్‌ల ఏఈవోలు ఎండలు ఎక్కువగా వస్తున్న దృష్ట్యా ఉదయం ఏడు గంటలకే పొలం లో ఉండాలని తెలిపారు. సర్వే నిబద్ధంగా ఉండాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు ఉన్నాయని తెలిపారు. జిల్లాలోని ఏడీఏలు, మండల వ్యవసాయాధికారులు ఎప్పటికప్పుడు ఏఈవోలకు సలహాలు ఇవ్వాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల ఏవో బాలాజీ, ఏఈవో శ్రీనివాసరాజు పాల్గొన్నారు.



ఆంధ్రజ్యోతి

● మధిర, ఎర్రుపాలెం, బోనకల్, చింతకాని, ముదిగొండ
● వైరా, కొణిజర్ల, కారేపల్లి, ఏన్కూరు, జూలూరుపాడు
● సత్తుపల్లి, కల్లూరు, తల్లాడ, వేంసూరు, పెనుబల్లి

ZONE

శుక్రవారం 7 ఫిబ్రవరి 2025

8

వైరా-మధిర సత్తుపల్లి

WYRA, MADHIRA, SATHUPALLY

వైరా ఆర్టీసీ బస్టాండ్‌లో...
జేబు దొంగల చేతివాటం

- ప్రతిరోజూ ప్రయాణికుల సెల్‌ఫోన్లు చోరీ
- పనిచేయని సీసీ కెమెరాలు
- పట్టించుకోని అధికారులు



వైరా బస్టాండ్

వైరా, ఫిబ్రవరి6 (ఆంధ్రజ్యోతి): వైరా ఆర్టీసీ బస్టాండ్‌లో జేబు దొంగలు హల్‌చల్ రోజురోజుకు పెచ్చురిల్లిపోతుంది. ప్రతి నిత్యం జేబు దొంగల చేతివాటానికి ప్రయాణికులు బీ తిల్లిపోతున్నారు. రోజుకు కనీసం ఇద్దరు, ముగ్గురు ప్రయాణికుల జేబుల నుంచి సెల్‌ఫోన్లు, డబ్బులు చోరీకి గురవుతున్నాయి. ఈ బస్టాండ్‌లో నాలుగు సీసీ కెమెరాలున్నప్పటికీ కొన్నినెలల నుంచి పనిచేయడం లేదు. అవి నిరుపయోగంగా పడి ఉన్నాయి. జేబు దొంగ ల చేతివాటానికి ఒక్క ప్రయాణికుడైనా బాధితుడు అవుతున్నాడు. ఇటీవల కొద్దిరోజుల కిందట ఒకేరోజు ముగ్గురు ప్రయాణికుల చేతిసంచులను కత్తిరించి వాటిలోని వేలాదిరూపాయల నగదు, బంగారు వస్తువులను కాజేసిన విషయం తెలిసింది. ఆమేరకు బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేయడం, కేసులు నమోదు కావడం జరిగింది. బస్టాండ్‌లో పోలీసుల గస్తీ పెంచినప్పటికీ జేబు దొంగలు మాత్రం చేతివాటాన్ని ఆపలేదు. బస్సు ఎక్కే ప్రయాణికుల జేబుల్లోని సెల్‌ఫోన్లను కాజేస్తున్నారు. ఒక్కోరోజు ముగ్గురు, నలుగురు ప్రయాణికులు కూడా సెల్‌ఫోన్ల బాధితులవుతున్నారు. భోగిపండుగ పర్వదినమైన సోమవారం ఖమ్మంలోని ఓ బ్యాంకు ఉద్యోగి తమ స్వగ్రామమైన బీరవల్లి నుంచి వైరా బస్టాండ్‌కు వచ్చి ఇక్కడి నుంచి భద్రాచలం వెళ్లే బస్సు ఎక్కుతున్న సమయంలో జేబు దొంగలు అతడి సెల్‌ఫోన్‌ను కాజేశారు. వెంటనే గమనించిన సదరు ప్రయాణీకుడు బస్సు దిగి బస్టాండ్‌లోకి వచ్చి వెతికినప్పటికీ అప్పటి సెల్‌ఫోన్ పనిచేయకుండా స్విచ్ఛాఫ్ అయింది. దీంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. బస్టాండ్‌లో నాలుగు సీసీ కెమెరాలున్నప్పటికీ అవి పనిచేయకుండా నిరుపయోగంగా పడి ఉన్నాయి. ఇదే అవకాశంగా జేబుదొంగలు చెలరేగిపోతున్నారు. ఇప్పటికైనా సీసీ కెమెరాలను బాగు చేయించి జేబు దొంగల ఆట కట్టించి ప్రయాణికులకు భరోసా కల్పించాలని పలువురు కోరుతున్నారు.

డిప్యూటీ సీఎం భట్టికి కృతజ్ఞతలు



డిప్యూటీ సీఎం భట్టికి వినతి పత్రం అందజేస్తున్న సుధాకర్

బోనకల్, ఫిబ్రవరి 6: మండలంలోని రావినూతల ఆర్అండ్‌బీ రోడ్డు నుంచి నారాయణపురం మీదుగా చిన్నబీరవల్లి వరకు 2.70 కిలోమీటర్ల రహదారికి బీటీ వేసేందుకు డిప్యూటీ సీఎం మల్లు భట్టీ విక్రమార్క రూ.3.33 కోట్ల నిధులను మంజూరు చేశారు. గ్రామ కాంగ్రెస్ నాయకుడు సూర్యదేవర సుధాకర్ పలుమార్లు డిప్యూటీ సీఎంని కలిసి సమస్యను ఆయన దృష్టికి తీసుకెళ్లడంతో స్పందించిన ఆయన నిధులను మంజూరు చేశారు. దీంతో భట్టికి కృతజ్ఞతలు తెలిపారు. పీసీసీ సభ్యుడు పైడిపల్లి కిషోర్ కుమార్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గాలి దుర్గారావు, వెంకటేశ్వర్లు తదితరులున్నారు.

'శ్మశాన వాటికను ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలి'



వినతిపత్రం ఇస్తున్న నాయకులు

మధిరటౌన్, ఫిబ్రవరి6(ఆంధ్రజ్యోతి): మది ర హిందూ శ్మశాన వాటికను ఆక్రమించిన వా రిపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరా రు. గురువారం హిందూ శ్మశాన వాటిక పరిరక్షణ కమిటీ, వికాస తరంగిణి, రిటైర్డ్ ఎంప్లాయిస్‌తో పాటు పలువురు డిప్యూటీ తహసీల్దార్ డేవిడ్ కరుణాకర్‌కు వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా హిందూ శ్మశాన వాటిక పరిరక్షణ కమిటీ అధ్యక్షుడు పుతుంబాక కృష్ణప్రసాద్ మాట్లాడుతూ మధిర హిందూ శ్మ శానానికి 10.04 కుంటల భూమి దాతలు ఉచితంగా అందచేశారని ఇది అనేక ఏళ్లుగా ఆక్రమణకు గురవుతుందని దీనిని హిందూ శ్మశాన వాటిక పరిరక్షణ కమిటీ అధికారుల దృష్టికి తీసుకుపోయి సర్వే చేయించి హద్దు రాళ్లు వేస్తే ఆక్రమణదారులు తీసివేసిన అధికారులు పట్టించుకోలేదని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో మాధవరపు నాగేశ్వరరావు, ములకలపల్లి మోహనరావు, వనమా సూరి, కాలం వీరబద్రరావు, పిచ్చయ్య, కుంచం కృష్ణారావు, కోనా జగదీష్, పల్లపోతుల నరసింహరావు, టి.వి.రెడ్డి, నాగేశ్వరరావు, రంగిశెట్టి కోటేశ్వరరావు పాల్గొన్నారు.

'జిల్లాలోని వంద గ్రామాల్లో మిర్చి రైతుల సభలు'



మాట్లాడుతున్న బొంతు రాంబాబు

వైరా, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): మిర్చి పంటకు మద్దతు ధర, ప్రభుత్వ కొనుగోలు కోసం ఉద్యమాన్ని చేపడతామని జిల్లాలోని వంద గ్రామాల్లో మిర్చి రైతుల సభలు నిర్వహిస్తామని తెలంగాణ రైతుసంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు ప్రకటించారు. మల్లెంపాటి రామారావు అధ్యక్షతన గురువారం వైరాలో జరిగిన రైతుసంఘ సమావేశంలో రాంబాబు మాట్లాడారు. మిర్చి క్వింటా ఒక్కింటికి రూ.25 వేల మద్దతు ధర నిర్ణయించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా నాఫెడ్, మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేయాలనే డిమాండ్‌తో వంద గ్రామాల్లో సభలు, సదస్సులు నిర్వహించి రైతుల అభిప్రాయం మేరకు ఉద్యమ కార్యాచరణ ప్రణాళిక తయారుచేస్తామని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో బొంతు సమత, చింతనిప్పు చలపతిరావు, బాణాల శ్రీనివాసరావు, పారుపల్లి శ్రీనాథ్, ఎస్‌డీ.పాషా, యనమద్ది రామకృష్ణ, హరి వెంకటేశ్వరరావు, వడ్లమూడి మధు, పాసంగులపాటి చలపతిరావు, శీలం నారాయణరెడ్డి, భద్రన్న పాల్గొన్నారు.

కానిస్టేబుల్‌ను సన్మానించిన సీపీ



కానిస్టేబుల్ ఉపేందర్‌నాయక్‌ను సన్మానిస్తున్న సీపీ

ముదిగొండ, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): కీలకమైన హత్య కేసులో నిందితులు నేరం నుంచి తప్పించుకోకుండా వారికి శిక్షపడేలా విధులు నిర్వహించిన కోర్టు డ్యూటీ కానిస్టేబుల్‌ను గురువారం ఖమ్మం పోలీస్ కమిషనర్ సన్మానించారు. మండలంలోని బాణాపురం తండాకు చెందిన సీఆర్పీఎఫ్ కానిస్టేబుల్ తేజావత్ ఉపేందర్‌నాయక్ అతని తల్లి పద్మలు ఉపేందర్‌నాయక్ భార్య కల్యాణిని హత్య చేసిన కేసులో ముదిగొండ పోలీస్‌స్టేషన్‌లో కోర్టు కానిస్టేబుల్‌గా విధులు నిర్వహించినందుకుగానూ ఆదినారాయణ, పీపీ ఏ.శంకర్‌లను పోలీస్ కమిషనర్ సునీల్‌దత్ గురువారం సన్మానించారు. ఖమ్మం రూరల్ ఏసీపీ తిరుపతిరెడ్డి, ముదిగొండ సీఐ ఓ.మురళీ పాల్గొన్నారు.

వేతనాలు చెల్లించాలని ధర్నా

కల్లూరు, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): పెండింగ్ వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ కల్లూరులో గురువారం ప్రభుత్వ ఆసుపత్రి ముందు ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి కార్మికుల గౌరవ అధ్యక్షుడు, జిల్లా ఏఐటీయూసీ ఉపాధ్యక్షుడు వేము రాంబాబు మాట్లాడారు. ఈ మేరకు కార్మికులు ఆసుపత్రి అధికారులకు వినతి పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో దామాల దయాకర్‌రావు, కార్మికులు వంశి, సురేంద్ర, నాగమణి, కోటేశ్వరి, నాగమణి, లక్ష్మి పాల్గొన్నారు.

వరి పంట పరిశీలన

సత్తుపల్లిరూరల్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రేజర్లలోని ఆర్ఎన్ఆర్-15048వరి పంటను శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారుల బృందం గురువారం సందర్శించింది. రైతులు గొర్ల అంజిరెడ్డి, పులగం అంజిరెడ్డి, భీమిరెడ్డి నరసారెడ్డిలు సుమారు 75ఎకరాలలో ఈ రకం వరిని సాగు చేయగా వారి ఫిర్యాదు మేరకు పంటల పరిశీలనకు వచ్చినట్లు సత్తుపల్లి ఏడీఏ వీ.శ్రీనివాసరెడ్డి తెలిపారు. బాధిత రైతుల నుంచి వివరాలను నమోదు చేసుకున్నారు. కార్యక్రమంలో కృషి విజ్ఞాన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ కే.రవికుమార్, డాక్టర్ వీ.చైతన్య, ఏవో వై.శ్రీనివాసరావు, విత్తన ధ్రువీకరణ అధికారి టీ.వేణుమాధవ్, ఏఈవో టీ.నరేష్ తదితరులు పాల్గొన్నారు.

పేలుడు పదార్థాల పట్టివేత

ఏన్కూర్, ఫిబ్రవరి6(ఆంధ్రజ్యోతి): వాహన తనిఖీల్లో పేలుడు పదార్థాలు లభ్యమైన సంఘటన ఏన్కూర్‌లో జరిగింది. పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం.. జన్నారం క్రాస్‌రోడ్డు వద్ద గురువారం సాయంత్రం పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా మండల పరిధిలోని కొత్తమేడేపల్లి గ్రామానికి చెందిన కొరసం రమేష్ అనేవ్యక్తి వద్ద పేలుడు పదార్థాలైన జిలిటెన్ స్టిక్ డిటోనేటర్లును తన వాహనంలో లభ్యమయ్యాయి. నిందితుడిని స్టేషన్‌కు తరలించి విచారించగా కొత్తమేడేపల్లిలో తనకు గంగరాజుకు తనకు గత కొన్ని రోజులుగా గొడవలు జరుగుతున్నాయని, అతడిని ఎలాగైనా పోలీసుల కేసులో ఇరికించాలనే నెపంతో ఈపేలుడు పదార్థాలు తీసుకొని వెళ్తున్నట్లు విచారణలో వెల్లడయిందని పోలీసులు తెలిపారు. రమేష్‌పై కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపించినున్నట్లు ఎస్ఐ రఫి తెలిపారు. కొండయ్య సైదా, రవి తదితరులు పాల్గొన్నారు.

'మద్యం విక్రయిస్తే కఠిన చర్యలు'

ఎర్రుపాలెం, ఫిబ్రవరి6(ఆంధ్రజ్యోతి):మండలంలోని బెల్టుషాపుల పేరుతో ఇష్టానుసారంగా మద్యం విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని తహసీల్దార్ మన్నె ఉషాశారద హెచ్చరించారు. మండలంలోని పలు గ్రామాలలో ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో 72 బెల్టుషాపుల నిర్వాహకులను బైండోవర్ చేశారు. ఆర్ఐలు రవికుమార్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

పెనుబల్లి, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): ఇంట్లో నిల్వ చేసిన 17క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని వీఎంబంజర్ పోలీసులు గురువారం పట్టుకొని కేసు నమోదు చేశారు. లంకపల్లి గ్రామానికి చెందిన దారా ఉపేంద్రరావు పీడీఎస్ బియ్యాన్ని తక్కువ ధరకు కొనుగోలు చేసి 34సంచుల్లో 17క్వింటాళ్లను తరలించేందుకు సిద్ధంగా ఉంచాడు. సమాచారం మేరకు ఎస్ఐ వెంకటేష్ దాడులు చేసి 17క్వింటాళ్ల రేషన్‌బియ్యం స్వాధీనం చేసుకున్నారు. ఉపేందర్‌రావును అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

పంటల డిజిటల్ సర్వేను త్వరగా పూర్తి చేయాలి

» డీఏవో ధనసరి పుల్లయ్య



సర్వేను పరిశీలిస్తున్న డీఏవో పుల్లయ్య

కొణిజర్ల, ఫిబ్రవరి6(ఆంధ్రజ్యోతి): పంటల డిజిటల్ సర్వేను త్వరగా పూర్తి చేయాలని, డిజిటల్ క్రాప్ బుకింగ్ పారదర్శకంగా ఉండాలని, ఏ ఒక్కరైతు సర్వేనెంబరు మిస్‌కావద్దని డీఏవో ధనసరి పుల్లయ్య అధికారులను సూచించారు. గురువారం మండల పరిధిలోని చిన్నగోపతిలో జరుగుతున్న డిజిటల్ క్రాప్ బుకింగ్‌ను ఆయన పరిశీలించారు. ఏఈవో శ్రీనివాసరాజును క్రాప్‌బుకింగ్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో ఉన్న అన్ని క్లస్టర్‌ల ఏఈవోలు ఎండలు ఎక్కువగా వస్తున్న దృష్ట్యా ఉదయం ఏడు గంటలకే పొలంలో ఉండాలని తెలిపారు. సర్వే నిబద్దంగా ఉండాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు ఉన్నాయని తెలిపారు. జిల్లాలోని ఏడీఏలు, మండల వ్యవసాయాధికారులు ఎప్పటికప్పుడు ఏఈవోలకు సలహాలు ఇవ్వాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల ఏవో బాలాజీ, ఏఈవో శ్రీనివాస రాజు, రైతులు పాల్గొన్నారు.

ఇళ్లపన్నులు చెల్లించి సహకరించండి

» మునిసిపల్ కమిషనర్ వేణు



అధికారులకు పన్నుల చెక్కును అందిస్తున్న నాగార్జున ఎరువుల దుకాణం యజమాని

వైరా, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): వైరా మునిసిపాలిటీలోని ప్రజలు సకాలంలో ఇంటిపన్నులు చెల్లించి మునిసిపల్ అభివృద్ధికి సహకరించాలని కమిషనర్ వేణు సూచించారు. మునిసిపాలిటీలో 12టీంలను ఏర్పాటుచేసి ఇళ్లపన్నులను వసూలు చేస్తున్నారు. గురువారం పన్నుల వసూళ్లను కమిషనర్ చింతా వేణు స్వయంగా పర్యవేక్షించారు. మునిసిపాలిటీలో మొత్తం రూ.4కోట్ల, 75వేల ఇంటిపన్నులు డిమాండ్ ఉంది. అయితే ఇప్పటివరకు రూ.1.27కోట్ల పన్నులను వసూలు చేశారు. ఇంకా దాదాపు రూ.3.06కోట్ల పన్నులను వసూలు చేయాల్సి ఉంది. గత ఏడాది కేవలం 52.12శాతం పన్నులు మాత్రమే వసూలయ్యాయి. గత ఏడాది పెండింగ్ పన్నులను కూడా ఇప్పుడు వసూలు చేస్తున్నారు. సకాలంలో పన్నులు చెల్లించి మునిసిపల్ అభివృద్ధికి తోడ్పాటునివ్వాలని కోరారు. ఇదిలా ఉంటే వేసవి కాలంలో చలివేంద్రాలు ఏర్పాటుచేసేందుకుగానూ కొత్త, పాత బస్టాండ్ల ప్రాంతాలను పరిశీలించారు.

ఫర్నీచర్ వితరణ

సత్తుపల్లిరూరల్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): సత్తుపల్లి పట్టణంలోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలకు హైదరాబాద్‌లోని నోష్ ల్యాబ్ ప్రయివేట్ లిమిటెడ్ నిర్వహకులు 2వ దఫా రూ.3లక్షల విలువైన ఫర్నీచర్‌ను గురువారం అందించినట్లు హెచ్ఎం నీరుడు నాగేశ్వరరావు తెలిపారు. గతవారం రూ.7లక్షల విలువైన ఫర్నీచర్‌ను అందించగా మొత్తంగా రూ.10లక్షల విలువైన సాయం అందించడంతో నోష్ ల్యాబ్ అధినేతలను ఉపాధ్యాయులు అభినందించారు.

శివాలయం వార్షికోత్సవం



పూజలు నిర్వహిస్తున్న భక్తులు

సత్తుపల్లి, ఫిబ్రవరి6 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గుడిపాడులో వేంచేసియున్న దుర్గపార్వతి సహిత కాశీవిశ్వేశ్వరస్వామి దేవస్థానం, పెద్దమ్మతల్లి దేవాలయం ప్రథమ వార్షికోత్సవాన్ని ఆలయ కమిటీ సభ్యులు గురువారం నేత్రపర్వంగా నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు డాక్టర్ మట్టా దయానంద్ విజయకుమార్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు అన్నసంతర్పణ కార్యక్రమం ఏర్పాటు చేశారు.

బహుమతుల ప్రదానం

సత్తుపల్లి, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): ఖమ్మంలోని నెహ్రూ యువకేంద్రం సహకారంతో కేసీఆర్ నగర్ యూత్ క్లబ్ ఆధ్వర్యంలో సత్తుపల్లిలోని జేవీఆర్ ప్రభుత్వ కళాశాల మైదానంలో ఇటీవల నిర్వహించిన బ్లాక్ లెవల్ స్పోర్ట్స్ మీట్‌లో విజేతలకు గురువారం బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డా.నంద్రు గోపీ, పీడీ డా.సీహెచ్.పూర్ణచంద్రరావు, పీర్ సాహెబ్, అధ్యాపకులు పాల్గొని స్పోర్ట్స్ కిట్స్, మెడల్స్, మెమోంటోలు, సర్టిఫికేట్లను అందించారు.

ట్రై సైకిళ్ల కోసం శిబిరాల నిర్వహణ

బోనకల్, ఫిబ్రవరి 6: తెలంగాణ రాష్ట్ర దివ్యాంగుల సహకార సంస్థ సహకారంతో వయో వృద్ధులు, దివ్యాంగుల కోసం పంపిణీ చేసే కృతిమ అవయవాలు, ట్రై సైకిళ్ల కోసం ఎంపిక చేసే లబ్ధిదారుల కోసం ఈ నెల 12వ తేదీన మధిరలోని రైతు వేదికలో నియోజకవర్గ వ్యాప్తంగా అర్హులైన వారు శిబిరానికి హాజరు కావాలని ఎంపీడీవో ఆర్.రమాదేవి కోరారు. రేషన్, ఆధార్ కార్డులు, వైకల్య ధృవీకరణ పత్రం తీసుకు రావాలని విజ్ఞప్తి చేశారు. బ్యాటరీ ట్రై సైకిళ్ల పంపిణీకి వైకల్యం 80 శాతంకు మించి ఉంటేనే అర్హులుగా పేర్కొన్నారు.

సీపీఎం ధర్నాను విజయవంతం చేయాలి

» సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యురాలు మాచర్ల భారతి

కల్లూరు, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో ఈ నెల 10న జరగనున్న సీపీఎం మహాధర్నాను విజయవంతం చేయాలని ఆ పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యురాలు మాచర్ల భారతి పిలుపు నిచ్చారు. గురువారం కల్లూరులో నిర్వహించిన సీపీఎం సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ఈ సమావేశంలో శీలం సత్యనారాయణరెడ్డి, మోరంపూడి పాండురంగారావు, తన్నీరు కృష్ణార్జునరావు, జాజిరి శ్రీనువాసరావు, చలమల విఠల్‌రావు, మాదాల వెంకటేశ్వరారావు పాల్గొన్నారు.

సేవాలాల్ జయంతిని సెలవు దినంగా ప్రకటించాలి

కల్లూరు, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంత్‌సేవాలాల్ మహారాజ్ జన్మదిన వేడుకలకు సెలవు దినంగా ప్రకటించాలని ఎల్‌హెచ్‌పీఎస్ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు దశరథ్‌నాయక్ డిమాండ్ చేశారు. కల్లూరు మండలంలోని హనుమాతండ గ్రామంలో గురువారం నిర్వహించిన సంఘం సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు నందునాయక్, బానోతు రామారావునాయక్, కృష్ణస్వామి, చందునాయక్, సీతాబాయి, కుమారి బాయి, బేబిబాయి, భూపతినాయక్ తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మలకుంట పరిధిలో చిరుతపులి సంచారం

సత్తుపల్లిరూరల్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): సత్తుపల్లి నియోజకవర్గంలోని పెనుబల్లి మండలం బ్రహ్మళకుంట గ్రామ పరిధిలో చిరుతపులి సంచరిస్తున్నట్లు అటవీ అధికారులు అప్రమత్తమయ్యారు. సత్తుపల్లి, పెనుబల్లి, కల్లూరు, తల్లాడ మండలాలతో పాటు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చంద్రుగొండ మండలంలో అంతర్భాగంగా ఉన్న గ్రామాల ప్రజలు అటవీ ప్రాంతంలో జాగ్రత్తగా ఉండాలని దండా వేయిస్తున్నారు. ఇందుకు సంబంధించిన చిరుతపులి ఆనవాళ్లను అటవీ అధికారులు గుర్తించి సోషల్ మీడియాతో పాటు వాట్సప్ గ్రూపులలో బీట్ ఆఫీసర్ భరత్ షేర్ చేశారు. పనికోసం ఫీల్డ్‌కు అధికారుతో పాటు ప్రజలు గుంపులుగా మాత్రమే వెళ్లాలని, రాత్రిపూట బయటకు వెళ్లేటప్పుడు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఏ జంతువు అయినా కనిపిస్తే అటవీశాఖకు సమాచారం అందించి వన్యప్రాణులకు రక్షణ కల్పించి హాని తలపెట్టవద్దని సత్తుపల్లి రేంజర్ స్నేహలత కోరారు.

తీన్మార్ మల్లన్న క్షమాపణలు చెప్పాలి

తల్లాడ, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): రెడ్డి సామాజిక వర్గాన్ని లక్ష్యంగా చేసుకొని ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న చేసిన వ్యాఖ్యలు అభ్యంతకరమని రెడ్డి సంక్షేమసంఘం మండల అధ్యక్షుడు కర్నాటి లక్ష్మారెడ్డి అన్నారు. గురువారం తల్లాడలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తక్షణమే తీన్మార్ మల్లన్న రెడ్డి సామాజిక వర్గానికి బేషరత్‌గా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. సొసైటీ డైరెక్టర్ దగ్గుల రాజశేఖర్‌రెడ్డి, సంఘం నాయకులు గొడుగునూరి లక్ష్మీరెడ్డి, వేమిరెడ్డి వెంకటనారాయణరెడ్డి పాల్గొన్నారు.

విద్యా, వైద్య రంగాలను పట్టించుకోని కేంద్రం

» సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు

బోనకల్, ఫిబ్రవరి 6: ప్రభుత్వరంగ సంస్థలను నిర్వీర్యం చేసేలా కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌ను రూపొందించిందని సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు ఆరోపించారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో గురువారం జరిగిన ఆ పార్టీ మండల సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్య, వైద్య రంగాలకు నిధుల కేటాయింపు సక్రమంగా లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో సీపీఎం డివిజన్ కార్యదర్శి మడిపల్లి గోపాలరావు, దొండపాటి నాగేశ్వరరావు, చింతలచెర్వు కోటేశ్వరరావు, కిలారు సురేష్, బందం శ్రీనివాసరావు, మర్రి తిరుపతిరావు, జొన్నలగడ్డ సునిత, వీరభద్రం, రమేష్ పాల్గొన్నారు.

పౌష్టికాహారం అందజేత

పెనుబల్లి, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): లంకాసాగర్ పీహెచ్‌సీకి వైద్యం నిమిత్తం ప్రతి గురువారం వచ్చే గర్భిణులకు పౌష్టికాహారం అందించాలనే ఉద్దేశ్యంతో వీఎంబంజర్‌కు చెందిన చిట్లూరి సత్యనారాయణ గురువారం పౌష్టికాహారాన్ని అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మందడపు అశోక్‌కుమార్, పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ సౌమ్య, డాక్టర్ ధరణి, సీహెచ్‌వో పూలమ్మ, ఎంపీహెచ్‌ఈవో శ్రీనివాస్, సీహెచ్ఎన్ సుగుణాదేవి, ఫార్మాసిస్టు కృష్ణవేణి, కిరణ్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

విద్యార్థుల క్షేత్ర పర్యటన

మధిర రూరల్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి స్కూల్స్ ఫర్ రైసింగ్ ఇండియా ఫీల్డ్ సందర్శనలో భాగంగా మధిర మునిసిపాలిటీ పరిధిలోని మడుపల్లి ప్రభుత్వ హైస్కూల్ విద్యార్థులు గురువారం పెనుబల్లి మండలంలోని పులిగుండాల ప్రాజెక్టును సందర్శించారు. హెచ్ఎం తోట నర్సింహారావు క్షేత్ర సందర్శన చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు

పరీక్ష ప్యాడ్ల పంపిణీ

తల్లాడ, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బిల్లుపాడు ఉన్నత పాఠశాలలో పదోతరగతి విద్యార్థులకు ప్యాడ్లు, పెన్నులు పంపిణీ చేశారు. సామినేని రామఅప్పారావు కుమారుడు కోదండరాం జన్మదినం సందర్భంగా విద్యార్థులకు ప్యాడ్లు, కంబాక్సులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు జక్కంపూడి కిషోర్, రమేష్, రామఅప్పారావు, రామకృష్ణ, నాగూల్‌మీరా పాల్గొన్నారు.

'నిర్బంధ పన్నుల వసూళ్లు ఆపాలి'

వైరా, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): వైరా మునిసిపాలిటీ పరిధిలో నిర్బంధ ఇళ్ల పన్నులు ఆపివేయాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో మునిసిపల్ కమిషనర్ చింతా వేణుకు గురువారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ మునిసిపాలిటీ పేరుతో విలీన గ్రామాల పేదలపై మోపిన పన్నుల భారాన్ని తగ్గించాలని కోరారు. సీపీఎం నాయకులు చింతనిప్పు చలపతిరావు, సుంకర సుదాకర్, మచ్చా మణి, పారుపల్లి కృష్ణారావు, మల్లెంపాటి రామారావు, కొంగర సుధాకర్, నాగూల్‌పాషా, గుమ్మా నర్సింహారావు, కురుగుంట్ల శ్రీనివాసరావు, అమరనేని కృష్ణ, పాల్గొన్నారు.

మార్చి 2న యూపీఎస్‌పై యుద్ధభేరీ

» సీపీఎస్ఈయూ జిల్లా అధ్యక్షుడు శశిధర్



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

కొణిజర్ల, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ఏప్రిల్ 1 నుంచి అమలు చేయబోతున్న యూపీఎస్ విధానాన్ని వ్యతిరేకిస్తూ మార్చి 2న యూపీఎస్‌పై యుద్దభేరీ పేరుతో మహాధర్నా నిర్వహించబోతున్నట్లు సీపీఎస్ఈయూ జిల్లా అధ్యక్షుడు చంద్రకంటి శశిధర్ తెలిపారు. కొణిజర్ల మండలం పల్లిపాడు ఉన్నత పాఠశాలలో ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చర్ల శ్రీనివాసరావు, రాష్ట్ర కార్యదర్శి రాగి సురేష్, సీపీఎస్ ఉద్యోగ, ఉపాధ్యాయులతో కలిసి గురువారం పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీపీఎస్ విధానాన్ని రద్దుచేయాలని కోరితే యూపీఎస్ తీసుకురావడం దారుణమన్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

సత్తుపల్లిరూరల్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర కులగణనలో భాగంగా బీసీ రిజర్వేషన్ 46శాతం ప్రకటించిన సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్రపటానికి గురువారం స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో క్షీరాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ విజయకుమార్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని వినతి

తల్లాడ, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): తల్లాడ మండలం అన్నారుగూడెంలో నెలకొన్న విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని ఎన్‌పీడీసీఎల్ వినియోగదారుల ఫోరం చైర్మన్ వేణుగోపాలచారికి అగ్రామస్థులు వినతిపత్రం సమర్పించారు. గురువారం ఏన్కూరులో జరిగిన తల్లాడ సబ్‌డివిజన్ స్థాయి విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదికలో బీజేపీ జిల్లా నాయకుడు ఆపతి వెంకటరామారావు ఆధ్వర్యంలో వినతిపత్రం సమర్పించారు. 50ఏళ్ల క్రితం ఏర్పాటుచేసిన విద్యుత్ లైన్లు రోడ్డు ఎత్తు పెరగడం క్రమేణా నివాస గృహాల సంఖ్య పెరుగుతుండటం వల్ల విద్యుత్ స్తంభాలకు సర్వీస్ వైర్లు కూడా పెరిగి రడ్డుకు అడ్డంగా ఉన్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో చీకటి వెంకటేశ్వర్లు, వెల్లంకి సుధాకర్, కట్టా ఖాదర్ బాబా తదితరులు పాల్గొన్నారు.

కలకోటలో చోరీ

బోనకల్, ఫిబ్రవరి 6: మండలంలోని కలకోట గ్రామంలో గురువారం గుర్తు తెలియని అగంతకులు పట్టపగలే చోరీకి పాల్పడ్డారు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ఇజ్జగాని కొండలరావు ఇటీవల వడ్లు అమ్మగా వచ్చిన డబ్బును కౌలుకు కట్టేందుకు బీరువాలో దాచాడు. కుటుంబ సభ్యులు ఇంటికి తాళం వేసి కొణిజర్ల మండలం పెద్దగోపతిలో గల తమ బంధువుల ఇంట్లో జరిగే శుభకార్యానికి వెళ్లారు. గ్రామంలో కొందరు అపరిచిత వ్యక్తులు యాచకుడు, కార్డులు పంచేందుకు వచ్చామని వేషాలలో అనుమానస్పదంగా సంచరించినట్లు గ్రామస్థులు తెలిపారు. పట్టపగలు అందరూ పనులకు వెళ్లడంతో పాటు ఇంటికి తాళం వేసి ఉండటంతో ఇదే అదునుగా భావించిన అగంతకులు తాళం పగులకొట్టి ఇంట్లోకి ప్రవేశించారు. బీరువాలో దాచిన రూ.2లక్షల నగదు, జత పట్టీలు ఎత్తుకెళ్లారని బాధితుడు వాపోయాడు. ఈ సంఘటనపై స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశానని తెలిపారు.

లైసెన్స్ లేకుండా మిర్చి కొనుగోలు చేస్తే చర్యలు

కారేపల్లి, ఫిబ్రవరి6(ఆంధ్రజ్యోతి): ఎలాంటి లైసెన్స్‌లు లేకండా రైతుల వద్ద నుంచి మిర్చి పంట కొనుగోలు చేస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఇల్లెందు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బి.రాంబాబు, కార్యదర్శి నరేష్‌కుమార్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని లక్ష్మీప్రియ కోటెక్స్ జినింగ్‌మిల్లులో వారు మాట్లాడుతూ మిర్చి పంటను రైతుల వద్ద నుంచి కొనుగోలు చేయాలంటే వారికి తప్పనిసరిగా లైసెన్స్ కలిగి ఉండాలన్నారు. మార్కెట్ కమిటి పరిధిలోని లైసెన్స్ లేకుండా మిర్చి కొనుగోలు చేస్తున్నపలువురికి నోటీసులు ఇవ్వడం జరిగిందన్నారు.

నేడు అయ్యగారిపేట రామాలయం ప్రతిష్ఠ



పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

సత్తుపల్లిరూరల్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అయ్యగారిపేటలోని శ్రీ సీతా రామ చంద్రస్వామి వారి త్రెయాహ్నిక ఏక కుండాత్మక నూతన ఆలయ ప్రతిష్ఠా మహోత్సవం 3వ రోజు గురువారం ఘనంగా నిర్వహించారు. శ్రీశ్రీశ్రీ త్రిదండి చిన్న జీయర్ స్వామి మంగళాశాసనములతో నేడు ప్రతిష్ఠ మహోత్సవం వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యు లు తెలిపారు. నేడు జరిగే ప్రతిష్ఠకు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆలయ కమిటీ సభ్యులు కోరారు.

'ఎక్సైజ్ అధికారుల చర్యలతో నాటుకోళ్ల మృతి'



మృతిచెందిన కోళ్లను చూపుతున్న మోహన్

తల్లాడ, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రంగంబంజర గ్రామంలో వ్యవసాయ క్షేత్రం లో ఎలుకల బెడద నివారణ కోసం మందు కలిపి ఉడకబెట్టిన ధాన్యాన్ని ఎక్సైజ్ అధికారులు చెల్లాచెదురుగా పడవేయడంతో అవి తిన్న నాటుకోళ్లు మృతిచెందాయని మాజీ ఎంపీటీసీ బాణోతు మోహన్ ఆరోపించారు. గురువారం ఎక్సైజ్ అధికారులు మోహన్ ఇంట్లో సోదాలు నిర్వహించారు. గుడుంబా కాసే పరికరాలు, బెల్లం దొరకకపోవడంతో తిరిగి వెళ్తున్న క్రమంలో ఎక్సైజ్ అధికారులు ధాన్యంలో కలిపిన ఎలుకల మందును చెల్లాచెదురుగా పడవేయడంతో అవి తిన్న నాటుకోళ్లు మృతిచెందినట్లు మోహన్ వాపోయాడు. నాటుకోళ్ల పెంపకం ద్వారా జీవనోపాధి పొందుతున్న తమ కుటుంబానికి అన్యాయం చేసిన ఎక్సైజ్ అధికారులపై చర్యలు తీసుకొని పరిహారం ఇప్పించాలని మోహన్ కోరారు.